MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

సంపుటి : 24 సంచిక: 3 రంగారెడ్డి నవంబర్ 2025 పేజీలు : 36 వెల : రూ. 10/-

## సాహస యాత్ర!






నందాదేవి హిమగిరిపై సి ఎస్ బృందం

## ఇవే ... 2025 జాతీయ ఉత్తమ స్వయంసహాయ సమాఖ్యలు!





Silver Jubilee Year
July 2025 - June 2026
apmas
Empowering Communities




'ఎఫ్ పి ఓల వ్యాపార వేగవంతం' ప్రాజెక్ట్ ప్రారంభ దృశ్యం

## అమర్ రహే !



కన్ను మూసిన సహకార ఉద్యమ సారథి శ్రీ రామా రెడ్డి


నాబార్డ్ సౌజన్యంతో ....

NABARD

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 24 సంచిక 3



సంపాదకీయం

## అభినందనలు !

**జా**తీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరు కలిగిన స్వయంసహాయ సమాఖ్యలు ఏవో వెల్లడైంది. కొన్ని నెలలపాటు ఎంతో గోప్యంగా, ప్రామాణికంగా, పారదర్శకంగా సాగిన ఉత్తమ సమాఖ్యల ఎంపిక ప్రక్రియకు తెరదించుతూ, ఈ ఏడాది పురస్కారాలు ఎవరిని వరించాయో న్యాయనిర్ణేతలు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ప్రథమస్థానం తెలంగాణా రాష్ట్రం హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన 'సాయి కృపా మండల సమాఖ్య'కు లభించింది. ద్వితీయ, తృతీయ స్థానాలు రెండూ జార్ఖండ్ రాష్ట్రానికే లభించడం విశేషం! మరో విశేషం ... ఆ సమాఖ్యలు రెండూ ఛత్రా జిల్లాలోనివే కావడం! రెండవ స్థానం: బన్హే ఆజీవిక మహిళా సంకుల్ స్వలంబికి లభించగా, మూదవ స్థానం ధనఖేరి ఆజీవిక మహిళా సంకుల స్వలంబి సహకార సమితికి లభించింది. తూర్పు ప్రాంతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జార్ఖండ్ మరో అవార్డును తన ఖాతాలో వేసుకున్నది. ఈ విశేషాల కొనసాగింపుగా , దక్షిణ ప్రాంతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ పురస్కారాలను రెండిటినీ తెలంగాణా సాధించడం, ఆ రెండూ కూడా నిజామాబాద్ జిల్లాకు చెందినవే కావడం గమనార్హం. అదేరీతిలో, పశ్చిమ ప్రాంతీయ స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన రెండు సమాఖ్యలూ మహారాష్ట్రకే చెందినవి కావడం, ఉత్తర ప్రాంతీయ స్థాయిలో ఎంపికైన రెండు సమాఖ్యలూ రాజస్థాన్ రాష్ట్రానికి, అందులోనూ రెండూ ఆల్వార్ జిల్లాకే చెందినవి కావడం మరో విశేషం! ఇందుకు భిన్నంగా, తూర్పు, ఈశాన్య ప్రాంతీయ స్థాయి పురస్కారాలను బీహార్ , జార్ఖండ్; త్రిపుర, అస్సాం గెలుచుకున్నాయి. ఉత్తమమైన పనితీరుతో పోటీలో నిలిచి, ప్రామాణికమైన కొలమానాల ప్రాతిపదికగా గెలిచి, తమ సత్తా చాటిన సమాఖ్యలన్నిటికీ, ఆ సమాఖ్యల బాధ్యులు, భాగస్వాములందరికీ మన:పూర్వక అభినందనలు! మరింత ఫలప్రదమైన, ప్రభావోత్పాదకమైన, చక్కని పనితీరుతో వీరి విజయ ప్రస్థానం మరెన్నో గణనీయమైన ఘనసోపానాలను అధిరోహించాలని ఆకాంక్ష! పోటీలో పాల్గొన్న మిగతా వివిధ సమాఖ్యలు కూడా ఏవో చిన్న చిన్న లోపాలతో, అవగాహన పరమైన అంతరాలతో విజయపథానికి దూరమై వుండవచ్చు. కాని, బాధపడవలసిందేమీలేదు. ఏ లోపాలు, ఏ ప్రతికూలాలు తమను గెలుపుబాటలో నిలువనీయకుండా చేశాయో పరిశీలన చేసుకుని, సరిదిద్దుకుంటే చాలు. అవకాశాలు అనంతంగా వుంటాయి. అవి ఆ స్వయం సమీక్ష సాగించి, ఉత్తమోత్తమంగా తమను తాము తీర్చి దిద్దుకుంటాయని ఆశించవచ్చు. ఉత్తమమైన పనితీరు కనబరిచే స్వయంసహాయ సమాఖ్యలను గుర్తించి, నిర్దిష్ట ప్రామాణిక కొలమానాల ప్రాతిపదికగా విజేతలను నిగ్గుతేల్చి, మనదేశం నలుమూలల నుంచి పాల్గొనే స్వయంసహాయ, అభివృద్ధిరంగ హేమాహేమీల సమక్షంలో, జాతీయ సమ్మేళనంలో,పండుగ వాతావరణంలో, పురస్కారాలతో సత్కరించనుండడం ఏపిమాస్‌కు వరుసగా యిది ఐదవ సంవత్సరం.2021 వ సంవత్సరంలో మొదలైన ఈ మహాక్రతువు నిరాఘాటంగా ఐదేళ్ళు పూర్తిచేసుకుంటుండడం సంతోషాన్ని కలిగిస్తున్నది. అవార్డులు లేదా పురస్కారాలు కేవలం ఒక వ్యక్తికో, సంస్థకో, సమూహానికో, వ్యవస్థకో పరిమితమైనవి కావు. అవి మొత్తం సమాజానికి స్ఫూర్తిని యివ్వగలిగే, దిశానిర్దేశం చేయగలిగే అపార ప్రేరణాత్మక శక్తి సాధనాలు! ఈ వాస్తవాన్ని గుర్తించే, వివిధ కారణాలవల్ల అప్పుడు కొంత నిద్రాణంగా వున్న స్వయంసహాయ ఉద్యమంలో తిరిగి చైతన్యాన్ని రగిలించి, జవజీవాలను పెంపొందించి, మళ్ళీవెలుగుబాట పట్టించే సదాశయంతో ఏపిమాస్ జాతీయ స్థాయిలో ఉత్తమ సమాఖ్యలను గుర్తించి, ప్రోత్సహించే గురుతర బాధ్యతను తలకెత్తుకున్నది. ఆనందకరమైన విషయం ఏమిటంటే, ఈ ప్రోత్సాహోద్యమం ఆశించిన విధంగానే, స్వయంసహాయ సమాఖ్యలలో గణనీయమైన ప్రేరణను కలిగిస్తున్నది. ఏటికేడాది పెరుగుతున్న దరఖాస్తుల సంఖ్యే యిందుకు తార్కాణం! 2025 నవంబర్ 20–21తేదీలలో మహోత్సాహంతో జరిగే జాతీయ సమ్మేళనంలో ఈ ఉత్తమ సమాఖ్యల ప్రతినిధులను ప్రత్యక్షంగా కలుసుకుని, వారి స్ఫూర్తిదాయమైన విజయగాథలను విని, ఆనందించడానికి సిద్ధంగా వుందాం.

ఇంతటి ఆనందోత్సాహంలో ఒక తీవ్ర విషాదం శ్రీ మామిడి రామారెడ్డి కన్నుమూత. ఎన్నో వైరుధ్యాలు, ప్రతిబంధకాలతో సతమతమవుతున్న మన సహకార వ్యవస్థను చక్కదిద్ది, సంస్కరించి, రాజ్యాంగ సవరణకు కూడా మార్గదర్శకత్వం వహించిన సహకారోద్యమ సారథి ఆయన. సహకార రంగంలో ఆయన లేని లోటు తీర్చలేనిది. ఆ మహనీయునికి మా హృదయపూర్వక స్మృత్యంజలి! ఆయన ఆశయాల సాధనకు ఏపిమాస్ నిర్విరామంగా కృషిచేస్తూనే వుంటుంది.

**Edited, Printed, Published and owned by T.Chandra Sekhar Reddy; Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No.CFC-1&2, Survey No.18, E-city, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, Telangana - 501359 and Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally, Manikonda,Ranga Reddy District,Telangana-500089. Editor:T.Chandra Sekhar Reddy**

మనల్ని మనం మార్చుకుంటే దేశం మారిపోతుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: **జి. శ్రీనివాస్, ఎల్. భవాని, ఆర్ రమాదేవి, ఎం. భార్గవి, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి**

**కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్ : కె. రఘురామరాజు**

**సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం : క్రిస్టాఫర్ వసంత్**

## లోపలి పేజీలలో ....

- మహిళా సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు 05
- మహిళా స్వయం'సహాయం'లో ఆంధ్రప్రదేశ్ ! 07
- సహకార ఉద్యమ సారథి రామారెడ్డి కన్నుమూత 08
- ఎఫ్.పి.ఓ ల వ్యాపారం ఇక మరింత వేగంగా .. 10
- ఎఫ్ పి ఓ లకు లైంగిక సమానత్వంపై శిక్షణ 12
- సరైన ఆహారం, ఆరోగ్యంతోనే పటిష్ఠ సమాజం! 14
- కలకడలో టమాట మార్కెటింగ్ ప్రారంభం 16
- చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన 17
- చిన్ననాడు కొండలెక్కి..నేడు హిమనగంపై చరించి.. 18
- ఆదిలాబాద్ లో 'వాష్' జిల్లాస్థాయి కార్యశాల 24
- గుంటూరు మహిళకు ప్రధాని ప్రశంస 26
- పాడి వ్యాపారం చేసే దంపతుల ఆదాయం ... 27
- ఓర్వకల్లు ముఖచిత్రాన్ని మార్చిన పొదుపుప్రస్థానం 28
- 500తో మొదలైన కోట్ల రూపాయల వ్యాపారం ! 30
- ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి 31
- ఆరోగ్యం, ఐక్యత,సేవాస్ఫూర్తికి ప్రతీక 'విప్రో రన్' 32
- రైతులకు తక్కువ ధరకే కూరగాయల నారు! 33
- చేబ్రోలుసర్పంచ్‌కి జాతీయస్థాయిలో మొదటిస్థానం 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృ సంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతో పాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం 'మహిళా సాధికారత' పత్రికతో పాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

పని భారానికి ఆసక్తే కొలమానం; ఆసక్తి వుంటే కష్టమైనా సులువే, అదే లేకుంటే సులువైనా కష్టమే

# ఉత్తమ మహిళా సమాఖ్యలకు జాతీయ పురస్కారాలు

– జి శ్రీనివాస్

ఏపిమాస్ 2021 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయ సంఘ సమాఖ్యలలో (ఎస్‌హెచ్‌జి ఫెడరేషన్లలో) ఉత్తమ ప్రతిభ కలిగిన సంస్థలను గుర్తించి, అభినందించి, ఇతర సంస్థలను ప్రొత్సహించే ఆశయంతో 'జాతీయస్థాయి ఉత్తమ మహిళా స్వయం సహాయ సమాఖ్యలఅవార్డు' లను ప్రారంభించింది. మహిళా స్వయం సహాయ సంఘాల ఉద్యమాన్ని మరింత బలపరచడం, సుస్థిరతను సాధించడం, అలాగే సంఘాల పరిపాలన, ఆర్థిక నిర్వహణ, సామాజిక అభివృద్ధి రంగాల్లో నాణ్యతతో కూడిన ప్రగతిని ప్రోత్సహించడం ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశం.

ఇప్పటికే నాలుగు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం, యిప్పుడు ఈ 2025 సంవత్సరంలో ఐదవ దఫా పురస్కారాల ప్రదానానికి సర్వసన్నద్ధమైంది. అవార్డుల మహోత్సవ నిర్వహణకు పూర్వ రంగంగా, ఈ ఏడాది కూడా దేశవ్యాప్తంగా రాష్ట్రాల వారీగా అర్హతగల మహిళా స్వయం సహాయ సమాఖ్యల నుండి దరఖాస్తులను ఆహ్వానించింది. ఏపిమాస్ ఈ జాతీయ పురస్కారాలకు వున్న విశేష ప్రాచుర్యం దృష్ట్యా, దరఖాస్తులు భారీగా అందాయి.

**ఎంపిక ప్రక్రియ**

గత నాలుగు సంవత్సరాల మాదిరిగానే, ఈ ఏడాది కూడా ఫెడరేషన్ల ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో చేపట్టబడింది. మొదటి దశలో, అందిన అన్ని దరఖాస్తులను పరిశీలించి, మూల్యాంకన ప్రమాణాల ఆధారంగా మొదటి స్థాయి ఎంపిక నిర్వహించారు. రెండవ దశలో ఆ ఎంపికైన ఫెడరేషన్ల ప్రదర్శన, పరిపాలనా వ్యవస్థ, ఆర్థిక పనితీరు, సభ్యసంఘాల అభివృద్ధి వంటి అంశాలను సవివరంగా పరిశీలించారు. ఈ మూల్యాంకన ప్రక్రియకు జ్యూరీ సభ్యులుగా డా. జయశ్రీవ్యాస్ (ఎం.డి., సేవాబ్యాంక్), శ్రీమతి గిరిజా శ్రీనివాసన్ (సెక్టార్

**2025 సంవత్సరానికి జాతీయ ఉత్తమ మహిళా సమాఖ్యల అవార్డు విజేతలు**

| క్ర.సం. | ర్యాంకు | ఫెడరేషన్ పేరు | మండలం | జిల్లా | రాష్ట్రము |
|---|---|---|---|---|---|
| | | **జాతీయ స్థాయి విజేతలు** | | | |
| 1 | ప్రథమ | సాయి కృపా మండల సమాఖ్య | కమలాపూర్ | హన్మకొండ | తెలంగాణా |
| 2 | ద్వితీయ | బన్హే అజీవిక మహిళా సంకుల్ స్వలంబి | సిమారియా | చత్ర | జార్ఖండ్ |
| 3 | తృతీయ | ధనఖేరి ఆజీవిక మహిళా సంకుల్ స్వలంబి సహకార సమితి లిమిటెడ్ | ఇత్ఖోరి | చత్ర | జార్ఖండ్ |
| | | **ప్రాంతీయ అవార్డులు .... దక్షిణ ప్రాంతం** | | | |
| 4 | ప్రథమ | జక్రాన్ పల్లి మండల మ్యూచువల్లీ ఎయిడెడ్ – కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ | జక్రాన్ పల్లి | నిజామాబాద్ | తెలంగాణ |
| 5 | ద్వితీయ | ఆర్మూర్ మండల పరస్పర సహకార పొదుపు మరియు క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ లిమిటెడ్ | ఆర్మూర్ | నిజామాబాద్ | తెలంగాణ |

నవ్వు సంతోషానికి సంకేతం కాకపోవచ్చు ; ఆత్మవిశ్వాసానికి, ఆశాభావానికి చిహ్నం

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | **పశ్చిమ ప్రాంతం** | | | |
| 6 | ప్రథమ | నవదిశ ప్రభావ సంఘ | కుడాల్ | సింధుదుర్గ్ | మహారాష్ట్ర |
| 7 | ద్వితీయ | శక్తిమహిళా ప్రభావ సంఘ | కుర్ఖెడ | గడ్చిరోలి | మహారాష్ట్ర |
| | | **ఉత్తర ప్రాంతం** | | | |
| 8 | ప్రథమ | క్రాంతి మహిళా మంచ్ | లక్ష్మణ్‌గర్ | అల్వార్ | రాజస్థాన్ |
| 9 | ద్వితీయ | చేతన మహిళా మంచ్ | తనగజీ | అల్వార్ | రాజస్థాన్ |
| | | **ఈశాన్య ప్రాంతం** | | | |
| 10 | ప్రథమ | బిజోయీ మహిళా క్లస్టర్ బహుముఖి సమబాయ సమితి లిమిటెడ్ | తెపానియా ఆర్.డి. | గోమతి | త్రిపుర |
| 11 | ద్వితీయ | పట్కల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ కో ఆపరేటివ్ సొసైటీ | మకుమ్ | టిన్సుకియా | అస్సాం |
| | | **తూర్పు ప్రాంతం** | | | |
| 12 | ప్రథమ | ఆనంద్ జీవికా వికాష్ స్వలంబి సహకార సమితి లిమిటెడ్ బీహార్ | | సక్రా | ముజఫర్‌పూర్ |
| 13 | ద్వితీయ | బఘూరియా ఆజీవిక మహిళా సంకుల్ సంఘటన్ ఘట్‌శిలా స్వలంబి సహకార సమితి లిమిటెడ్ | | తూర్పు సింగ్‌భమ్ | జార్ఖండ్ |

నిపుణులు), శ్రీ పి. మోహనయ్య (ఏపిమాస్ బోర్డు సభ్యులు), శ్రీ జిజిమమ్మెన్ (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఇఓ,సా–ధన్), శ్రీమతి మధుఖేతాన్ (ఇంటిగ్రేటర్, ప్రదాన్), శ్రీ రాజేష్ సింఘి (సెక్టార్ నిపుణులు) వంటి ప్రముఖులు సేవలందించారు.

**విశేషాలు:**

ఈసంవత్సరం విజేతలుగా నిలిచిన 13 మహిళా సంఘ ఫెడరేషన్లు తమ తమ రాష్ట్రాల్లో మహిళల ఆర్థిక సశక్తీకరణ, సమూహబలం, వ్యవస్థీకృత కార్యకలాపాలు, సమగ్ర అభివృద్ధిలో విశేష పాత్ర పోషించాయి. ప్రముఖ అంశాలలో పరిపాలనలో పారదర్శకత, సభ్య సంఘాల సక్రమ సమావేశాలు, పుస్తక నిర్వహణ, సంఘాల లాభదాయక వ్యాపారాలు, రైతు, మహిళా వ్యాపార కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం వంటి అంశాలు ప్రత్యేకంగా గుర్తించబడ్డాయి.

**ఏపిమాస్ పాత్ర**

ఏపిమాస్ సంస్థ గత రెండు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా మహిళా సంఘ ఉద్యమానికి మద్దతుగా వ్యవస్థీకృత శిక్షణలు, సాంకేతిక సహాయం, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ అవార్డు కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘ ఫెడరేషన్లలో ఉత్తమ పనితీరును గుర్తించి, వాటి అనుభవాలపై ఇతర రాష్ట్రాలకు, ఇతర సమాఖ్యలకు అవగాహన కల్పించడం ద్వారా ఉత్తమ ఆచరణ విధానాలను వ్యాప్తిచేయడం ఏపిమాస్ ప్రధాన లక్ష్యం.

ఈ అవార్డులు మహిళా సంఘ ఉద్యమానికి నూతన ప్రేరణను అందిస్తున్నాయి. అవార్డులు పొందిన ఫెడరేషన్‌లకు 2025 నవంబర్ 20–21 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ సమ్మేళనంలో పురస్కారాలను ప్రదానం చేయటం జరుగుతుంది. అవార్డులు పొందిన సమాఖ్యల

**సూర్యోదయం అవకాశాలను అందిస్తుంది, సూర్యాస్తమయం ఆ అవకాశాలను ఏంచేశావని నిలదీస్తుంది**

# మహిళా స్వయం'సహాయం'లో అగ్రభాగాన ఆంధ్రప్రదేశ్ !

స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. మహిళా సాధికారత, సంఘాలకు రుణాల అందజేయడంలో రోల్ మోడల్‌గా మారింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా సాధికారత, రుణాల అందజేత, వ్యాపారాభివృద్ధి తదితర అంశాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతోంది. మహిళా బృందాల్లోని సభ్యులకు పెద్దఎత్తున రుణాలు ఇవ్వడంతో పాటు వాటి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఏపీ మొదటిస్థానంలో నిలిచింది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆంధ్రప్రదేశ్ రూ. 34,83,725 కోట్లు అందజేసి అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో రూ. 1,23,326 కోట్లు అందజేసి ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో, రూ. 1,05,132 కోట్లు పంపిణీ చేసి బీహార్ మూడోస్థానంలో నిలిచాయి.

అలాగే స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడం, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు సంబంధించి మహిళా రైతులను ప్రోత్సహించడంలోనూ ఆంధ్రప్రదేశ్ తనదైన ముద్ర వేసింది. 12,97,051 మంది మహిళలకు చేయూతనిచ్చి మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా, 11,37,950 మంది మహిళా రైతులను మద్దతుగా నిలిచి ఉత్తరప్రదేశ్ రెండోస్థానంలో ఉంది. 10,43,085 మంది మహిళా రైతులకు చేయూతనిచ్చి ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

---

ప్రతినిధులతో పాటు, దేశం నలుమూలల నుండి అనేక ఫెడరేషన్‌ల ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారు.

ఐదేళ్ళుగా ఏపిమాస్ నిర్వహిస్తున్న ఈ జాతీయ ఉత్తమ మహిళా స్వయంసహాయ సమాఖ్యల అవార్డులు, మహిళా సమాఖ్యల కృషిని గుర్తించి ప్రోత్సహించడానికి ఒక గొప్ప వేదికగా నిలిచాయి.

ఈ అవార్డులు కేవలం గౌరవం మాత్రమే కాకుండా, ఇతర సంఘాలకు ప్రేరణగా కూడా మారాయి. సమాఖ్యల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల దిశగా మహిళా సంఘ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ, దేశవ్యాప్తంగా మహిళల సామాజిక– ఆర్థిక సాధికారతకు ఏపిమాస్ మార్గదర్శకత్వం నిరాఘాటంగా కొనసాగుతున్నది. పురస్కారాలకు ఎంపికైన సమాఖ్యలను ఏపిమాస్ అభినందిస్తున్నది. ■

## ప్రవాసాంధ్ర భరోసా పథకం

ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధి, భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టీ సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా భీమా పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పని చేస్తున్న ఆంధ్రాకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులకు లబ్ది చేకూరుతుందని చెబుతున్నారు. ఏపీ నుంచి వెళ్లి అక్కడ స్థిర పడిన ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల కోసం ఈ పథకం తీసుకొచ్చారు. తన దుబాయ్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు 'ప్రవాసాంధ్ర భరోసా' పథకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లి చేస్తున్న వారికి బాటసగా నిలవటమే లక్ష్యంగా ఈ పథకాన్నిరూపొందించారు

ఎవరి పేరుతో భీమా చేశారో... ఆ వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా, రూ. 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవచ్చునని శ్రీ చంద్రబాబు నాయుడు తెలిపారు. ■


# సహకార ఉద్యమ సారథి రామారెడ్డి కన్నుమూత !

**– మూల సమాచారం: సి డి ఎఫ్ బృందం, తెలుగుసేత: మురళీ జజ్జూన, కె. శ్రీనివాస్**

**స**హకార రంగంలో ఎన్నో ఆచరణాత్మక సంస్కరణలకు, విప్లవాత్మక మార్పులకు, వినూత్న ప్రయోగాలకు సూత్రధారిగా నిలిచి, నమూనాచట్టాల రూపకల్పనలో, రాజ్యాంగ సవరణలకు మార్గదర్శనంలో కీలకపాత్ర పోషించి, సహవికాస సంస్థను స్థాపించి, గ్రామీణులలో పొదుపు అలవాటును ప్రోత్సహించి, వారిలో స్వయంశక్తిని ప్రేరేపించి తన జీవితమంతా సహకారోద్యమానికి, సమాజసేవకు అంకితం చేసిన చిరస్మరణీయుడు శ్రీ మామిడి రామారెడ్డి 2025 అక్టోబర్ 26న కన్నుమూశారు. ఆ మహనీయునికి ఏపిమాస్ స్మృత్యంజలి ఘటిస్తున్నది.

---

**ది**వంగత మామిడి రామారెడ్డి గారు ప్రముఖ సమాజ సేవకులు. 'కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్' (సి డి ఎఫ్ – సహ వికాస) స్థాపకులు. సహకార ఉద్యమంలో కీలక భూమిక పోషించిన శ్రీ రామారెడ్డి 1943 వ సంవత్సరంలో జన్మించారు. 2025 అక్టోబర్ 26 న పరమపదించారు. సహకార సంస్థల స్వయంప్రతిపత్తి కోసం ఆయన ఎంతగానో పోరాడారు. పౌరులకు సహకార సంస్థలు స్థాపించుకునే హక్కును గుర్తించేలా 97వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందే ప్రక్రియలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు.



*శ్రీ రామారెడ్డితో శ్రీ సి ఎస్ రెడ్డి*

**విద్యా నేపథ్యం**

- ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ నుండి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, జర్నలిజంలో పీజీ డిగ్రీ.
- ఢిల్లీ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ
- ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ (అమెరికా)లో లోకల్ గవర్నెన్స్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ లో పీజీ

**ప్రజా సేవా రంగంలో ...**

- రీసెర్చ్ అసోసియేట్ : సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్, న్యూఢిల్లీ (1965–66)
- జర్నలిస్ట్: పేట్రియాట్ పత్రిక, న్యూఢిల్లీ (1966–67)
- గ్రామపంచాయత్ అధ్యక్షుడు, శంషాబాద్ (67–70)
- సమితి అధ్యక్షుడు, రాజేంద్రనగర్ (70–76)
- చీఫ్ ఎగ్జిక్యూటివ్, (సి డి ఎఫ్–సహవికాస), (75–99)
- అధ్యక్షుడు, సహవికాస (2000 – 2009)

**సహవికాస స్థాపన**

సహవికాస (సి డి ఎఫ్)ను రామారెడ్డి గారు 1975లో స్థాపించారు. దీని ప్రధాన లక్ష్యం సహకార సంస్థలు స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ, వాటిని పెంపొందిస్తూ, సహకార సూత్రాలకు అనుగుణంగా వికేంద్రీ కృత, ప్రజాస్వామ్య, స్వయం సహాయ, పరస్పర సహాయ సంస్థలుగా ఎదగడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం.

1990 నుండి సహవికాస గ్రామీణ స్థాయిలో సూక్ష్మ రుణ సంస్థలను (ఎం ఎఫ్ ఐ లను) ప్రోత్సాహించడంలో కీలకపాత్ర పోషిస్తున్నది. 2025 మార్చి 31 నాటికి, సహవికాస 344 మహిళా పొదుపు సహకార సంఘాలలో 1,56,000 గ్రామీణ మహిళలతో రూ. 300 కోట్ల స్వంత నిధులతో, 241 పురుషుల పొదుపు సహకార సంఘాలలో

1,13,000 పురుషసభ్యులతో రూ. 270 కోట్ల స్వంత నిధులతో, 5 జిల్లాలలో (వరంగల్, హనుమకొండ, కరీంనగర్, సిద్దిపేట్, జనగాం) దాదాపు 320 గ్రామాలలో పని చేస్తోంది. ఈ 585 పొదుపు సహకార సంఘాలు కేవలం సభ్యుల పొదుపులే పెట్టుబడిగా, సభ్యులకు సూక్ష్మ రుణాలను అందిస్తూ, మనుగడ సాగిస్తున్నాయి.

2009 తర్వాత సహవికాసను స్థానిక పొదుపు సహకార సంఘాల ప్రతినిధులకు అప్పగించగా, వారే స్వయంగా సహవికాస సంస్థను నిర్వహిస్తున్నారు. సహవికాస సంస్థ ముఖ్య బాధ్యతలు, కార్యకలాపాలు ఈ విధంగా ఉన్నాయి.

- సభ్య సహకార సంస్థల పనితీరుపై నియమిత సమీక్ష నిర్వహించడం
- స్టేషనరీ సరఫరా చేయడం
- సభ్య సహకార సంస్థల నిర్వాహకులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం
- సహకార శాఖకు అవసరమైన రిటర్నులు సమర్పించడంలో సహాయం చేయడం
- "అభయనిధి" కార్యక్రమం నిర్వహించడం – రుణగ్రహీత సభ్యుడు మరణించినప్పుడు, సహకార సంస్థ, హామీదారులు, మరణించిన సభ్యుని కుటుంబం నష్టపోకుండా రక్షణ కల్పించడం
- అవసరమైన సభ్య సహకార సంస్థలకు రుణాలు ఇవ్వడం ద్వారా మిగులు నిధులను సమర్ధవంతంగా వినియోగించడం
- సభ్య సంస్థలకు అనుభవాలను పంచుకునే వేదిక కల్పించడం, ఒకరినుంచి ఒకరు నేర్చుకునే అవకాశాలను, అడ్డంకులను అధిగమించే వ్యూహాలను అభివృద్ధి చేయడం, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను రూపొందించడం, ఆడిట్ సేవలు అందించడం

**సహకార ఉద్యమంలో పాత్ర**

అప్పటికే శ్రీ విశ్వనాథ రెడ్డి అధ్యక్షతన ముల్కనూర్ సహకార సంఘం ఒకవైపు విజయవంతంగా నడుస్తుండగా, మరొకవైపు మరెన్నో సహకార సంఘాలు విఫలమవుతున్నాయి.

ఈ వైఫల్యాలకు కారణాన్ని పరిశీలించిన శ్రీ రామారెడ్డి పాత సహకార చట్టం పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉండటం వలన సభ్యులు సొంత నిర్ణయాలు తీసుకోవడానికి, స్వయం పరిపాలనకు, స్వయం నియంత్రణ చేసుకోవడానికి ఆస్కారం లేకపోవడమే ప్రధాన లోపాలుగా గమనించారు. అందుకే, దేశంలోని వివిధ సహకార రంగ నిపుణులతో కలిసి ఇందుకు పరిష్కారాలను సూచించే బాధ్యతను భుజాలకు ఎత్తుకున్నారు. వీటిలో ముఖ్యంగా చెప్పదగినవి :

- 1989–90లో బ్రహ్మప్రకాశ్ కమిటీతో కలిసి నమూనా సహకార సంఘం బిల్లురూపకల్పనలో సహకారం
- 1995లో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి రామారావు సహకారంతో ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ (మాక్స్ యాక్ట్) రూపకల్పనలో కీలకపాత్ర.
- ఏడు రాష్ట్రాలకు (జమ్మూ–కాశ్మీర్, బీహార్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఓడిస్సా , కర్ణాటక) సహకార చట్టాల రూపకల్పనలో సాంకేతిక సహాయం.
- యుఎన్‌డిపి ప్రాయోజిత లార్జ్ ప్రాజెక్ట్‌లో భాగంగా వివిధ రాష్ట్రాలకు వర్తించే సహకార సంఘాల చట్టం–2002 (మల్టీ స్టేట్ కోఆపరేటీవ్ సొసైటీస్ చట్టం) రూపకల్పన.
- రామ్‌నివాస్ మీర్ధా కమిటీతో కలిసి 1984 చట్టం సమీక్ష.
- 1983 నుండి 2000 వరకు 100కి పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించి, పార్లమెంట్ సభ్యులు, న్యాయకోవిదులు, సహకార రంగ నిపుణులు, ప్రభుత్వాధికారులు, విద్యావేత్తలు, వర్క్‌షాప్‌లలో పాల్గొన్న యితరులతో చర్చించి, కోఆపరేటివ్ నమూనా బిల్లు రూపకల్పన. ఆనంతరం క్షేత్రస్థాయి అనుభవాల ప్రాతిపదికగా ఆ బిల్లును మరింత ఆచరణాత్మకంగా సవరించడం
- 1998–2000 మధ్య 18 జాతీయ, ప్రాంతీయ వర్క్‌షాప్‌లను నిర్వహించి లాభాపేక్ష లేని సొసైటీల కొరకు నమూనా చట్టం రూపకల్పన.

(మిగతా 23 వ పేజీలో)

# ఎఫ్.పి.ఓ ల వ్యాపారం ఇక మరింత వేగంగా ...!

## జోరు పెంచే ప్రాజెక్ట్‌కు ఏపిమాస్, ఎస్ బి ఐ ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకారం

– ఎన్. వికాస్ కుమార్

ఏపిమాస్ – ఎస్ బి ఐ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎఫ్.పి.ఓ లను వేగవంతమైన వ్యాపార సంస్థలుగా మార్చే ప్రాజెక్ట్ ప్రారంభ కార్యక్రమం 29-10-2025 తేదీన హైదరాబాద్‌లోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. రైతు సంస్థలను బలోపేతం చేయడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఏపిమాస్ ఎస్‌బిఐ ఫౌండేషన్ (ఎస్‌బిఐఎఫ్) సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం శ్రీసత్యసాయి, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలలోని 30 'వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్ పి ఓల) వ్యాపార నిర్వహణను, వచ్చే మూడు సంవత్సరాలలో (2025-2028) వేగవంతం చేయడం, బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ కార్యక్రమంలో నిర్వాహక సంస్థల తరపున ముఖ్య అతిథులుగా శ్రీ సంజయ్ ప్రకాశ్ (యండి & సీఈఓ, ఎస్‌బిఐఎఫ్), శ్రీ స్వపన్దర్ (డెజిగ్నేట్ యండి & సీఈఓ, ఎస్‌బిఐఎఫ్), శ్రీ కాకి మాధవరావు, ఐఏఎస్ (రిటైర్డ్)– చైర్మన్, ఏపిమాస్, శ్రీమతి మహాపారా అలీ (బీఓడీ, ఏపిమాస్), శ్రీమతి రాజశ్రీ వర్మ (అసిస్టెంట్ మేనేజర్, ఎస్‌బిఐఎఫ్), శ్రీ సుభదీప్ మండల్ (ప్రోగ్రాం లీడ్, ఎస్‌బిఐఎఫ్), శ్రీ సి.ఎస్. రెడ్డి (సీఈఓ, ఏపిమాస్), శ్రీమతి రామలక్ష్మి (ఈడీ, ఏపిమాస్) పాల్గొన్నారు.

దీపప్రజ్వలనతో, ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఇది చిన్న మరియు సన్నకారు రైతులను కలసికట్టుగా ముందుకు తీసుకెళ్లే కొత్త ప్రయాణానికి సంకేతంగా నిలిచింది.

శ్రీసి.ఎస్. రెడ్డి తన స్వాగతోపన్యాసంలో, ప్రెజెంటేషన్‌లో ఏపిమాస్ 24 సంవత్సరాల ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు. ఆయన ఏపిమాస్ మిషన్, విజన్, గురించి ప్రస్తావిస్తూ, ప్రజాసంస్థలను బలోపేతం చేయడం, సుస్థిర జీవనోపాధులను ప్రోత్సహించడం, సమూహాల స్వయం సమృద్ధిని సాధించడం వంటి లక్ష్యాలను పేర్కొన్నారు. గత ఎఫ్ పి ఓలతో ఏపిమాస్ సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన గుర్తు చేస్తూ, నిర్వహణపరమైన మార్గదర్శకత్వం, సామర్థ్యాభి వృద్ధి, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలలో సాధించిన ప్రధాన విజయాలను పంచుకున్నారు.




శ్రీ సతీష్ కుమార్ తన ప్రగతి నివేదికలో, 2025 మార్చి నుండి సాధించిన ప్రధాన విజయాలను ప్రదర్శించారు. ఇందులో డయాగ్నస్టిక్ స్టడీలు, 23 ఎఫ్‌పీఓల ఆన్ బోర్డింగ్, ట్యాలీ ఆధారిత ఈఆర్‌పీ సిస్టమ్‌ల ప్రారంభం, ఇన్‌పుట్ , అవుట్‌పుట్ మార్కెటింగ్‌లో గణనీయమైన వ్యాపార వృద్ధి వంటి అంశాలు ఉన్నాయి.

నల్లమడ ఎఫ్ పి ఓ, సుగుటూరు గంగమ్మ ఎఫ్ పి ఓ (పుంగనూరు), రెడ్డమ్మ ఎఫ్ పి ఓ (కలకడ), శ్రీ భ్రమరాంబిక వెఫ్ పి ఓ (నందికొట్కూరు), నందీశ్వర ఎఫ్ పి ఓ (సెట్టూరు), ఎం-టమాట ఫెడరేషన్ డైరెక్టర్లు తమ అనుభవాలను



పంచుకున్నారు. ఏపిమాస్, ఎస్‌బిఐఎఫ్ కలసి తమ సంస్థలను పాలన, వ్యాపార ప్రణాళిక, డిజిటలైజేషన్, మార్కెట్ ఆర్థిక ప్రాప్తి వంటి అంశాలలో ఎలా బలోపేతం చేశాయో వక్తలు వివరించారు. ఈ మద్దతుతో తమ సభ్య రైతులలో నమ్మకం పెరిగి, గణనీయమైన పురోగతి సాధించగలిగామని తెలిపారు.

తరువాత, శ్రీ చిరంజీవి చౌదరి (రిటైర్డ్ ఐఎఫ్ఎస్) వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొని, ఆక్సిలరేషన్ కార్యక్రమ నిర్వహణ సంకల్పాన్ని అభినందించారు. ఆయన ఏపిమాస్, ఎస్‌బిఐఎఫ్ లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు, ఇండస్ట్రీస్ – కామర్స్ శాఖల ద్వారా అవసరమైన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.

తరువాత శ్రీ సంజయ్ ప్రకాశ్ (యండి & సీఈఓ, ఎస్‌బిఐఎఫ్) మాట్లాడుతూ, ఎస్‌బిఐఎఫ్ చేపడుతున్న మహిళా వ్యాపార ప్రోత్సాహం, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి , వ్యాపార ఆక్సిలరేటర్ ప్రోగ్రామ్, పర్యావరణం, సుస్థిరత వంటి అంశాల గురించి వివరించారు. ఆయన అంకిత భావంతో ఏపిమాస్ చేస్తున్న పూర్వకమైన పనిని ఎస్‌బిఐఎఫ్ – ఎల్ ఈ ఏ పి ప్రాజెక్ట్‌లో భాగమైన ఎఫ్‌పీఓల అభివృద్ధిని ప్రశంసించారు. రైతు సంస్థల బలోపేతానికి, గ్రామీణ జీవనోపాధి అభివృద్ధికి ఎస్‌బిఐఎఫ్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

శ్రీ కాకి మాధవరావు, ఐఏఎస్ (రిటైర్డ్) చైర్మన్, ఏపిమాస్ తన అధ్యక్ష ప్రసంగంలో, ఎస్‌బిఐఎఫ్, ఏపిమాస్ మధ్య ఉన్న సహకారాన్ని అభినందిస్తూ, సంస్థాగత బలోపేతం, నాయకత్వ అభివృద్ధి ప్రాముఖ్యత గురించి వివరిస్తూ, ఇవి రైతు సంస్థలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తాయని చెప్పారు.

కార్యక్రమం ముగింపులో ఎస్‌బిఐఎఫ్ బృందాన్ని సన్మానించడమే కాకుండా, అనంతపురం, చిత్తూరు , కర్నూలు జిల్లాల ఎఫ్‌పీఓ ఫెడరేషన్లను వారు సమూహ మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి రంగాలలో సాధించిన విశేష విజయాలకు అభినందించారు. శ్రీమతి రామలక్ష్మి (ఈడీ, ఏపిమాస్) కార్యక్రమానికి హాజరైన అతిథులకు, భాగస్వాములు , ఎఫ్‌పిఓ ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం, ఎఫ్ పి ఓలు ప్రదర్శించిన స్టాల్‌లను ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు సందర్శించారు, అక్కడ వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించబడ్డాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని రైతు ఉత్పత్తిదారుల సంస్థల సామర్థ్యాన్ని ప్రతిబింబించాయి.

చివరగా ఈ కార్యక్రమానికి హాజరైన ఎఫ్ పి ఓల సభ్యులు మాట్లాడుతూ, ఇంత చక్కని కార్యక్రమం ఏర్పాటు చేసిన ఏపిమాస్ , ఎస్‌బిఐ ఫౌండేషన్ సంస్థలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఏపిమాస్, ఎస్‌బిఐఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాజెక్ట్ కు సంబంధించిన ఈ ప్రారంభ కార్యక్రమం కేవలం ఒక ప్రారంభంలా కాకుండా, రైతుల అభ్యున్నతి, జీవనోపాధి మెరుగుదల, రైతు సంస్థల సుస్థిర నిర్మాణానికి సంయుక్తంగా సాగుతున్న ఉజ్వల ప్రస్థాన ప్రారంభంగా రూపుదిద్దుకున్నది. ■

**వ్యక్తిత్వమనేది హఠాత్తుగా ఊడిపడదు; ఎంచుకునే మార్గం, అనుసరించే విధానమే దాని చిరునామా**

# మధ్యప్రదేశ్ ఎఫ్ పి ఓ లకు లైంగిక సమానత్వంపై శిక్షణ

– జి. శ్రీనివాస్

ఏ సి సి ఇ ఎస్ ఎస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ , మధ్యప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ (యం పి – ఎస్ ఆర్ ఎల్ ఎం) సంయుక్త ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల్లో (ఎఫ్‌పిఓ లు) లైంగిక సమానత్వం, మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఒక కీలకమైన ప్రణాళికను ప్రారంభించాయి.

ఈ ప్రణాళికలో భాగంగా, 110 ఎఫ్‌పిఓలలో మార్పు తీసుకురావడానికి, శిక్షకులకు శిక్షణ ఇచ్చే (ట్రెయినింగ్ ఆఫ్ ట్రెయినర్స్ – టి ఓ టి) మూడు రోజుల పాటు 2025 అక్టోబర్ 13–15 తేదీలలో భోపాల్‌లోని వాల్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఏపిమాస్ బృందం విజయవంతంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఏపిమాస్ సంస్థ తరపున శ్రీమతి ఎ. కళామణి, శ్రీ జి. శ్రీనివాస్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఫ్‌పిఓలలో మహిళల భాగస్వామ్యం, నాయకత్వం, మార్కెట్లలో సమాన అవకాశాలపై అవగాహన కల్పించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.

**శిక్షణలో ప్రధాన అంశాలు**

ఈ టి ఓ టి కార్యక్రమంలో సుమారు 30 మంది ఎస్ ఆర్ ఎల్ ఎం సిబ్బంది, ఎఫ్‌పిఓ సీఈఓలు, ఫీల్డ్ స్థాయి నిపుణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చర్చలు, గ్రూప్ వ్యాయామాలు, ఇంటరాక్టివ్ ఆటలు, వీడియోలు , విజువల్ లెర్నింగ్ టూల్స్ ద్వారా శిక్షణ సాగింది.

- **లైంగిక అవగాహన:** 'సెక్స్' , 'జెండర్' (లింగం) మధ్య తేడాలను స్పష్టం చేస్తూ, లైంగిక ఆధారిత పాత్రలు సామాజికీకరణ ద్వారా ఎలా ఏర్పడతాయో వివరించడం.
- **నాయకత్వం పెంపు :** మహిళల సభ్యత్వం, నాయకత్వం, నిర్ణయ ప్రక్రియల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచే మార్గాలను చర్చించడం.
- **ఆర్థిక భాగస్వామ్యం :** వాల్యూ చెయిన్‌లో మహిళల క్రియాశీలక పాత్రను గుర్తించి, సమాన అవకాశాలను పెంచే మార్గాలను విశ్లేషించడం.
- **కార్యాచరణ ప్రణాళిక :** ప్రతి ఎఫ్ పి ఓ స్థాయిలో లింగ సమానత్వాన్ని సాధించడానికి ఒక సమగ్ర దృష్టి (విజన్) మరియు ఆచరణాత్మక కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్)ను రూపొందించడం.

**రోజువారీ శిక్షణ విశేషాలు**

- "జెండర్ అవగాహన" : 'సెక్స్' మరియు 'జెండర్' మధ్య తేడాను విశ్లేషించారు. 'టై ద రోప్', 'పవర్ వాక్', 'పిక్ అప్ టూ ఆబ్జెక్ట్స్' వంటి ఆసక్తికరమైన ఆటల ద్వారా పనుల విభజన, లింగ పాత్రలపై ఆలోచింప జేశారు. 'జెండర్ ఇన్ డెవలప్‌మెంట్' మరియు ఎస్ డి జి లలో మహిళల స్థానం' వంటి అంశాలపై చర్చలు జరిగాయి.
- **మహిళా నాయకత్వం :** మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే పద్ధతులు, లింగ విశ్లేషణా పరికరాలు (జెండర్ ఎనాలసిస్ టూల్స్) గురించి లోతుగా చర్చించారు. ఎఫ్‌పిఓల పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి అవసరమైన విధానాలు మరియు సమాన అవకాశాలను కల్పించే మార్గాలపై సమూహ చర్చలు జరిగాయి.

**జెండర్ సూచీలు , వ్యూహాలు :** జెండర్ ఇండికేటర్స్, జెండర్ ఆడిట్ టూల్స్ వినియోగంపై దృష్టి సారించారు. ప్రతి ఎఫ్‌పిఓ తమ స్వంత సంస్థకు వర్తించే విధంగా సమానత్వ వ్యూహాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది.

**నేర్చుకున్న విషయాలు, అవగాహన**

ఈ శిక్షణలో పాల్గొన్నవారు ఈ కింది అంశాలను నేర్చుకున్నారు, గ్రహించారు:

**ఇతరులను లెక్కచేయని పొగరుబోతుగా మార్చే విజయం కంటె, వినయాన్ని నేర్పే ఓటమి మేలు**

**1. సామాజిక అంశం:** "జెండర్ అనేది సామాజికమైనది – సహజం కాదు" అనే అంశం స్పష్టమైంది. లైంగిక సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలి.

**2. మహిళల భాగస్వామ్యం :** ఎఫ్‌పిఓ లలో మహిళల సభ్యత్వం, బోర్డులో వాటా , నిర్ణయాధికారంలో వారి భాగస్వామ్యాన్ని అత్యవసరంగా పెంచాల్సిన అవసరం ఉంది.

**3. పురుషులలో అవగాహన:** లైంగిక సమానత్వం కేవలం మహిళల బాధ్యత కాదని, పురుషులలో కూడా లైంగిక అవగాహన పెంపు అత్యవసరం అని గుర్తించారు.

**4. పాలసీ మార్పులు :** ఎఫ్‌పిఓ బైలాస్‌లు, పాలసీలు మరియు బడ్జెట్‌లో మహిళలకు అనుకూలమైన, లైంగిక సమానత్వాన్ని ప్రతిఫలించే నిబంధనలను చేర్చాలని నిర్ణయించారు.

**5. సమాన అవకాశాలు :** వాల్యూ చెయిన్ (విలువ శృంఖలం)లోని ప్రతి దశలో మహిళల పాత్రను గుర్తించి వారికి సమాన అవకాశాలు ఇవ్వాలనే అవగాహన ఏర్పడింది.

**భవిష్యత్ వ్యూహాలు – కార్యాచరణ సూచనలు**

శిక్షణలో గుర్తించిన అవసరాల మేరకు, ఎఫ్‌పిఓ స్థాయిలో లైంగిక సమానత్వాన్ని సాధించడానికి ఈ క్రింది కార్యాచరణ సూచనలు రూపొందించబడ్డాయి.

**శిక్షణలు :** ప్రతి ఎఫ్‌పిఓ గ్రామం స్థాయిలో మహిళలకు, పురుషులకు లైంగిక అవగాహన శిక్షణలు నిర్వహించడం.

- ♦ కమిటీల ఏర్పాటు : ఎఫ్‌పిఓలలో "జెండర్ సబ్ కమిటీలను" ఏర్పాటుచేసి, పురుష సభ్యులతో ప్రత్యేక లైంగిక అవగాహన సమావేశాలు నిర్వహించడం.
- ♦ నాయకత్వ ప్రోత్సాహం : మహిళా నాయకత్వానికి మెంటార్‌షిప్ కార్యక్రమాలు , విజయవంతమైన మహిళా ఆధ్వర్యంలోని ఎఫ్‌పిఓల సందర్శనలు (ఎక్స్‌పోజర్ విజిట్స్) ఏర్పాటు చేయడం.
- ♦ పాలసీ సంస్కరణలు : ఎఫ్‌పిఓ బైలాస్‌లో మహిళలకు అనుకూలమైన మార్పులు చేర్చడం. ఎస్ ఆర్ ఎల్ ఎం శిక్షణా మాడ్యూల్స్‌లో లైంగిక అంశాలను సమగ్రంగా చేర్చడం.

**భవిష్యత్ దిశ**

ఎ సి సి ఇ ఎస్ ఎస్, యం పి – ఎస్ ఆర్ ఎల్ ఎం ప్రతినిధులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రశంసించారు. శ్రీ చింతన్ మేఘవాంశీ ( ఎ సి సి ఇ ఎస్ ఎస్), శ్రీ అరవింద్ (ఎన్ యం యం ఫార్మ్, ఎన్ ఆర్ ఎల్ ఎం), శ్రీ మనీష్ (ఎస్ పి ఎం ఫార్మ్ – యం పి – ఎన్ ఆర్ ఎల్ ఎం) తదితరులు చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

శిక్షణ విజయవంతంగా నిర్వహించిన దృష్ట్యా ఎ సి సి ఇ ఎస్ ఎస్ సంస్థ ఏపిమాస్‌కు మరో 10 రాష్ట్రాల్లోనూ ఇటువంటి శిక్షణలు నిర్వహించమని సూచించింది.

**ముగింపు**

ఈ మూడు రోజుల శిక్షణా శిబిరం ద్వారా, 'లైంగిక సమానత్వం' అనేది కేవలం మహిళా సాధికారతకు సంబంధించిన అంశం కాదని, అది పురుషులు, మహిళలు సమానంగా అభివృద్ధి చెందే సమగ్ర మార్గం అని పాల్గొనేవారు తెలుసుకున్నారు. ఎఫ్‌పిఓలలో మహిళల సభ్యత్వం, నాయకత్వం, నిర్ణయాధికారాన్ని పెంపొందించడం ద్వారా మాత్రమే సమాజంలో, ఎఫ్‌పిఓలలో నిజమైన సమాన అవకాశాలు సాధ్యమవుతాయని ఈ శిక్షణ స్పష్టం చేసింది. ■

## జీవామృత కేంద్రాలకు రూ. లక్ష సాయం

ప్రకృతి వ్యవసాయంలో వాడే జీవామృతం, ఘన జీవామృతం వంటి వాటిని విక్రయించేందుకు బయో–ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (బిఆర్‌సి) లను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. వీటిని 'జీవామృత కేంద్రాలు'గా పిలుస్తున్నారు. ప్రతి బిఆర్‌సి ఏర్పాటుకు రూ. లక్ష చొప్పున రెండు విడతల్లో కేంద్రం ఆర్థికసాయం అందిస్తోంది. స్థానిక రైతుల అవసరాలకు తగ్గట్టు కషాయాలు, ద్రావణాలు తయారుచేయాలి. దీనికోసం స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలి. ■

# సరైన ఆహారం, ఆరోగ్యంతోనే పటిష్ఠ సమాజం!

– భవాని, జాహ్నవి

మన దేశంలో చాలామంది పిల్లలు, తల్లులు సరైన ఆహారం అందుకోలేక పోషణ లోపాలను ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, విటమిన్లు, ఖనిజాల ప్రాధాన్యత గురించి ప్రజలకు తెలియజేయడం కోసం 2018 సంవత్సరంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ "పోషణ మాసం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు, పిల్లలు, యువతలో పోషణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.



ఈ సంవత్సరం, సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జరిగిన ఈ కార్యక్రమం ఈ క్రింది 5 ముఖ్యఅంశాలపై దృష్టి సారించింది:

1. ఊబకాయం నివారణ – మన ఆహారంలో చక్కెర, ఉప్పు, నూనె వినియోగాన్ని తగ్గించడం.
2. శిశువుల, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు – పిల్లలకు వయసుకు తగిన సరైన పోషకాహారం అందించడం.
3. పురుషుల భాగస్వామ్యం – పోషణ కార్యక్రమాల్లో, మహిళల ఆరోగ్య సంరక్షణలో పురుషులను కూడా భాగస్వాములుగా చేయడం.
4. చిన్నారుల సంరక్షణ, విద్య – "పోషణతో పాటు చదువు కూడా" అనే భావనతో పిల్లల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించడం.
5. "అమ్మ పేరుతో ఒక చెట్టు" కార్యక్రమం – తల్లిపట్ల గౌరవ సూచకంగా ఒక చెట్టు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడం.

తల్లులలో, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఏపిమాస్ పట్టణ పోషణ పథకం వారు విద్యార్థులతో ర్యాలీలు, తల్లులతో సమావేశాలు , డైట్ సర్వే లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. గుడిమల్కాపూర్లోని దేవాలిజంసింగ్ ఉన్నత పాఠశాలలో 6, 7, 8వ తరగతి చదువుతున్న సుమారు 150 మంది విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సరైన పోషణ ప్రాముఖ్యత, సమగ్ర ఆరోగ్యాభివృద్ధి పట్ల అవగాహన కల్పించడంకోసం ఆసక్తికరమైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు రోజువారీ ఆహారంలో ధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, కొవ్వులు వంటి అన్ని ప్రధాన ఆహార సమూహాలను చేర్చడం ఎంత ముఖ్యమో వివరించారు. అలాగే, సమతుల్య ఆహారం శరీర ఆరోగ్యం కాపాడటంలో, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో,

**పరస్పర నమ్మకం అనుబంధానికి బలం, వారికోసం అవసరమైతే రాజీపడడం ఆ బంధానికి శాశ్వతత్వం**




శారీరక, మానసిక అభివృద్ధికి ఎంత దోహదపడుతుందో తెలియజేశారు. విషయాన్ని మరింత ఆకర్షణీయంగా చేయడానికి దృశ్యచిత్రాలు, నిజజీవిత ఉదాహరణలు పోషకాహార క్విజ్, చిన్న నాటిక ద్వారా విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోగలిగేలా చేశారు.

విద్యార్థులు ఉత్సాహంగా ప్లకార్డులు పట్టుకుని “ఆరోగ్యకర ఆహారం – ఆరోగ్యవంతమైన మనసు”, “పిజ్జా బర్గర్ వద్దు, డబ్బా రొట్టెనే మనకు ముద్దు ” వంటి నినాదాలు పలుకుతూ, మంచి ఆహార అలవాట్లను పాటించమని ప్రజలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి చురుకైన విద్యా కార్యక్రమాలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలకు మించి, నిజజీవితంలో పోషణ ప్రాముఖ్యత అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సరైన ఆహార ఎంపికపై బాధ్యతా భావం పెంపొందడమే కాకుండా, తమ కుటుంబం, పరిసర సమాజంలో పోషకాహార సందేశాలను విస్తరించే భావం బలపడుతుందని వారు పేర్కొన్నారు.

**“స్వస్థ నారి – శక్తివంత కుటుంబం”**

వీటితోపాటు రవీంద్రనగర్, గిరికపల్లి ఆంగన్‌వాడీ కేంద్రాలలో ఐసిడీఎస్ గోల్కొండ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసం ముగింపు సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, 5 సంవత్సరాల లోపు పిల్లల తల్లులు, సుమారు 100 మంది మహిళలు చురుకుగా పాల్గొన్నారు.

సమావేశంలో గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార వైవిధ్యత, తల్లులకు సంబంధించిన పోషణ, అనుబంధ ఆహారం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. కార్యక్రమంలో “ఫుడ్ మేళా”, మరొక ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

అంగన్‌వాడీ టీచర్లు స్థానికంగా లభ్యమయ్యే పదార్థాలతో రాగి లడ్డూ, మిల్లెట్ కిచ్డీ, పాలకూర చపాతీ, బాలమృతం లడ్డూ, పల్లీ చిక్కీ వంటి అనేక పోషకా హార వంటకాలను సిద్ధం చేసి, ఇలాంటి ఆరోగ్యకరమైన వంటలు తక్కువ ఖర్చుతో, రుచికరంగా కూడా సిద్ధం చేయవచ్చని తల్లులకి వివరించారు. ఈ మేళా మహిళలు, పిల్లలు సమతుల్య భోజనాల సమన్వయాన్ని అర్థం చేసుకునే వేదికగా మారింది.

అదనంగా, విప్రో సంస్థ ఉద్యోగులు “స్పిరిట్ ఆఫ్ విప్రో రన్” సందర్భంలో తయారు చేసిన పోషకాహార కిట్లను 70 మంది తల్లులకు పంపిణీ చేశారు. ప్రతి కిట్‌లో రాజ్ గిరా లడ్డూ, పల్లీ చిక్కీ, ఖర్జూరాలు, గర్భిణీ, బాలింతల సంరక్షణపై సమాచార పత్రికలు, చేతి తువాలు, అన్ని రకాల ఆహారాలు తినాలి అని సూచించే మూడు రంగుల తాడు అందించారు.

ఈ కార్యక్రమం “స్వస్థ నారి – శక్తివంత కుటుంబం” అనే సందేశాన్ని బలపరిచింది. ఆరోగ్యవంతమైన స్త్రీ ఒక శక్తివంతమైన కుటుంబానికి మూలాధారం అని అందరికీ గుర్తు చేసింది. పోషణ మాసం సందర్భంగా చేసిన కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్యంపై, పోషకాహారంపై, మరియు సామూహిక సంక్షేమంపై కొత్త చైతన్యం నింప కలిగింది. ■

**మన మనస్సు ఒక ఆయస్కాంతం ! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది**

# కలకడలో ఎఫ్.పి.ఓ ల టమాట మార్కెటింగ్ ప్రారంభం

– జి. శ్రీనివాస్

అన్నమయ్య జిల్లాలోని కలకడ మండలం ప్రధానంగా కూరగాయల సాగులో ముందుంది. ఈ రైతులు టమాటాను ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. అయితే పంటకు సరైన ధరలు లేకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యం, మార్కెట్‌లో అస్థిరత వంటి సమస్యల వల్ల రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపిమాస్ మద్దతుతో నాబార్డు మరియు అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో ఏర్పాటైన "రెడ్డమ్మ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఓ)", రైతుల ఉత్పత్తులను సామూహికంగా మార్కెట్ చేయడానికి ముందడుగు వేసింది.

**లక్ష్యాలు:**

1. రైతులకు స్థిరమైన మరియు న్యాయమైన ధరలు అందించడం.
2. టమాట ఉత్పత్తిని సామూహికంగా సేకరించి పెద్ద మార్కెట్‌లకు అమ్మకం.
3. రైతులకు నిల్వ మరియు రవాణా సదుపాయాలు కల్పించడం.
4. మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రత్యక్ష మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పరచడం.
5. టమాట ఉత్పత్తికి బ్రాండ్ గుర్తింపు మరియు విలువ చేర్చడం.

అక్టోబర్ నెలలో మొత్తం 13 టన్నుల టమాటాను రూ. 1,98,270/– రిటైల్ మార్కెటింగ్ (రిలయన్స్ మరియు ఫ్రెష్–కో) కు సప్లై చేయడం జరిగింది.

**మార్కెటింగ్ వ్యూహాలు**

- సమూహ విక్రయం : ఎఫ్ పి ఓ రైతుల ఉత్పత్తిని పెద్ద మొత్తంలో విక్రయించడం ద్వారా మార్కెట్ బలాన్ని పెంచింది.
- ధర చర్చలు: మదనపల్లె మార్కెట్ వ్యాపారులతో నేరుగా ధర చర్చలు జరిపి, రైతులకు లాభదాయక ధరలు నిర్ధారించడం.
- సమాచార వినియోగం : మార్కెట్ ధరలను రోజువారీగా ఎఫ్ పి ఓ వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతులకు తెలియజేయడం.
- విలువ చేర్చిన ఉత్పత్తులు: అధిక ఉత్పత్తి సమయంలో టమాట పల్ప్ మరియు ప్యూరీ తయారీపై ప్రణాళికలు ప్రారంభం.

రైతులు సగటున మార్కెట్ కంటే 10–15% అధిక ధర పొందారు. అదనంగా రవాణా ఖర్చు తగ్గడం వల్ల లాభదాయకత పెరిగింది.

**ఎదురైన సవాళ్లు:**

1. మార్కెట్ ధరల్లో అస్థిరత మరియు సీజనల్ ఉత్పత్తి ఒత్తిడి.
2. నిల్వ మరియు కోల్డ్ స్టోరేజ్ సదుపాయాల కొరత.
3. ట్రాన్స్‌పోర్ట్ మరియు లాజిస్టిక్స్ ఖర్చులు ఎక్కువ.
4. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల పంట నాణ్యతలో మార్పులు

**ముఖ్య పాఠాలు:**

- సమూహ విక్రయం ద్వారా ధర స్థిరత్వం సాధ్యం అవుతుంది.
- మార్కెట్ సమాచారం సమయానుకూలంగా పంచడం రైతుల నిర్ణయ సామర్థ్యాన్ని పెంచుతుంది.
- పారదర్శక చెల్లింపులు రైతుల విశ్వాసాన్ని బలపరుస్తాయి.
- విలువ చేర్చిన ఉత్పత్తులు (టమాట పల్ప్, సాస్) దీర్ఘకాలిక స్థిర ఆదాయానికి దోహదం చేస్తాయి.

ఈ ప్రయత్నం వల్ల కలకడ మండలంలోని రైతు న్యాయమైన ధరలు, స్థిరమైన మార్కెట్, మరియు దీర్ఘకాలిక అభివృద్ధిని పొందుతున్నారు. ■

**ముందడుగుతో బలం, కలిసి నడవడంతో ఐకమత్యం, ఒకరికొకరు నిలవడంతో అనుబంధం**

# చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

– భవాని, జాహ్నవి

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం వారు అక్టోబర్ 15,2025న ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా, కార్వాన్ పరిధిలోని శ్రీ గాయత్రీ ఉన్నత పాఠశాల మరియు కుల్సుంపురా ఉన్నత పాఠశాలల్లో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం పిల్లలలో సరైన చేతుల శుభ్రత ప్రాముఖ్యతను, దాని ద్వారా ఆరోగ్యం కాపాడుకోవడం, అంటువ్యాధులను నివారించడం ఎంత ముఖ్యమో తెలియజేయడమే లక్ష్యంగా చేపట్టబడింది. ఈ అవగాహన సదస్సు ద్వారా రెండు పాఠశాలలలో కలిపి సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు.



ముందుగా ప్రపంచ చేతి పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి పరిచయం, అలాగే సబ్బుతో చేతులు కడగడం వల్ల జ్వరం, దగ్గు ,జలుబు లాంటి వ్యాధులు, శ్వాస సంబంధ వ్యాధులు,, ఇతర అంటువ్యాధులను ఎలా నివారించవచ్చో వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని మరింత ఆకర్షణీయంగా, నేర్చుకునే విధంగా తీర్చిదిద్దటానికి ఫ్లాష్‌కార్డులు, ఫ్లిప్‌చార్టులు, వీడియో ప్రదర్శనలు వంటివి ఉపయోగించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పద్ధతిలో చేతులు కడగడం గురించి ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతి దశను అనుసరించారు. అలాగే, ఎప్పుడు చేతులు కడగాలి.

ఉదాహరణకు భోజనం ముందు, భోజనం తరువాత, బయట ఆడుకున్న తరువాత, మరుగుదొడ్డి ఉపయోగించిన తరువాత, చెత్త లేదా జంతువులను తాకిన తరువాత వంటి సందర్భాలపై చర్చించారు.

ప్రశ్నోత్తరాలు, చిన్న క్విజ్‌లు, ప్రాక్టికల్ సన్నివేశాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకోవడం మాత్రమే కాకుండా, ఆరోగ్య సందేశాలపై పిల్లలుకు సుస్థిరమైన అవగాహన ఏర్పడింది. ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఎంతో సహాయపడ్డారు. వారు విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం చేతుల శుభ్రతపై స్థిరమైన అవగాహన, ప్రవర్తనా మార్పును పిల్లలలో నెల కొల్పడం ద్వారా చిన్నప్పటి నుంచే ఈ అలవాట్లు పెంపొందితే, పాఠశాల వాతావరణం మరింత శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మారుతుంది. చివరికి ఇది సమాజ ఆరోగ్యానికి కూడా బలమైన పునాది వేస్తుంది.

### ఖానాపూర్‌లో ....

మహిళా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవం (గ్లోబల్ హ్యాండ్ వాష్ డే) నిర్వహించడం జరిగిందని జిల్లా సమన్వయ కర్త మైత్రి ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ చేతులు సబ్బు, హ్యాండ్ వాష్ లిక్విడ్‌తో కడుక్కోవాలని, రోజువారీ జీవితంలో పాఠ శాలలు, కార్యాలయాలు, బజార్, రహదారులు వంటి ప్రదేశాల్లో తాకే వస్తువుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లు చేతులకు అంటుకుంటాయని, అవి భోజనం సమయంలో శరీరంలోకి వెళ్ళి వ్యాధులను కలిగిస్తాయని వివరించారు.

మెప్మా సిఓ రవీందర్, శ్రావంతి మాట్లాడుతూ చేతులు కడుక్కోవడం అనే చిన్న విషయమే కానీ శక్తివంతమైన అలవాటు అని, దీనిని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ■

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !


# చిన్ననాడు కొండలు ఎక్కి... నేడు హిమనగంపై చరించి ... !

**జీవితకాలంలో ఒక్కసారి లభించే మనోజ్ఞ , భయోద్విగ్న , చిరస్మరణీయ ఆ'నందా'శ్చర్యానుభూతి !!**

*ఏపిమాస్ సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీమతి సబిత దంపతులు, కొందరు మిత్ర బృందంతో కలిసి 2025 అక్టోబర్ 3-13 తేదీల మధ్య హిమాలయ పర్వత శ్రేణిలో 4,150 మీటర్ల ఎత్తైన 'నందా దేవి పర్వతపు 'బేస్ క్యాంప్'కు సాహసయాత్ర చేపట్టారు. (నందా దేవి పర్వతం ఎత్తు: 7,817 మీటర్లు). రెండు రోజుల పాటు పర్వతారోహణ సాగించి, 3,500 మీటర్ల ఎత్తుకు చేరుకున్నారు. అయితే, తీవ్రమైన మంచు తుపాను కారణంగా, వీరు మూడవ రోజు నుంచి ముందుకు సాగలేక అక్కడే చిక్కుకుపోయారు. అది ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన భీతావహ ఘట్టం! గత్యంతరంలేక, 4 వరోజున వెనుతిరిగారు. కాని, ఈ సాహస యాత్రలో వారు ప్రకృతి చిత్రించిన ఎన్నో మనోహర దృశ్యాలను సందర్శించారు. మరెన్నో విశేషానుభవాలను పొందారు. ఆ సాహస గాధను, తాము పొందిన అరుదైన అనుభూతులను శ్రీ సి ఎస్ రెడ్డి చదువరులకు నందాదేవి పర్వతారోహణ ప్రత్యక్షానుభూతిని కలిగించే రీతిలో ఎంతో ఆసక్తిదాయకంగా ఆంగ్లంలో అక్షరబద్ధం చేశారు. ఏపిమాస్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీమతి ఎల్ భవాని దానిని తెలుగులోకి చక్కగా అనువదించారు. ఇప్పుడు ఆ అరుదైన అనుభూతిని మీరూ పొందండి ....*

**నే**ను ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో, కలికిరి మండలంలోని నాయునిచెరువుపల్లె అనే చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించాను. చిన్నప్పుడు, స్నేహితులతో కలిసి వేసవి సెలవుల్లో కొన్నిసార్లు సరదాగా, ఇంకొన్నిసార్లు కట్టెల కోసం అంకాళమ్మ కొండ ఎక్కేవాడిని.

నేను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నప్పుడు, తిరుమల కొండల పైకీ కిందికి ఎన్నిసార్లు పరుగులు తీసేవాడినో లెక్కేలేదు. ఆ తర్వాతి కాలంలో వైష్ణోదేవి, అమర్‌నాథ్ వంటి పుణ్యక్షేత్రాల పర్వతశ్రేణులను అధిరోహించాను. ఇంతేకాక 2023లో అమెరికా పర్యటనలో కూడా నేను బంధు మిత్రులతో కలిసి 'మిషన్ పీక్' ఎక్కాలన్న ఆసక్తికి అడ్డుకట్ట వేయలేకపోయాను. ఆలాగే, గ్రాండ్ క్యాన్యాన్ ను సందర్శించకుండా వుండలేకపోయాను.



అయితే నా నిజమైన పర్వత యాత్ర 2023 అక్టోబర్‌లో నా భార్య సబితతో కొందరు స్నేహితులతో చేసిన అన్నపూర్ణ బేస్ క్యాంప్ ట్రెక్‌తో మొదలైంది. ఆ అనుభవం ఎలాగైనా సరే, కైలాస్ మానస సరోవర్ యాత్ర చేయాలనే అభీష్టాన్ని మాలో జ్వలింపజేసింది, 2026లో ఆ యాత్ర చేపట్టి, మా చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకోవాలనే ఆకాంక్షను దృఢతరం చేసింది.

**శిక్షణ , యాత్రాబృందం**

ఈ నందాదేవి ట్రెక్ కోసం మేము మూడు నెలలు గట్టి శిక్షణ తీసుకున్నాము. మా ప్రధాన బృందంలో నా ప్రియ స్నేహితులు ప్రసాద్ , సుచీ (కేబిఆర్ పార్క్ వాకర్స్) వున్నారు. వీరే యాత్ర ప్రణాళిక, శిక్షణ, సమన్వయ బాధ్యతను చేపట్టారు. మాతో పాటు హైదరాబాద్ నుంచి సందీప్, సంతోష్, పూర్ణిమ, ఢిల్లీ నుంచి మాధవి, సీమ, శరత్ కూడా చేరారు. మా యాత్రను దాను అడ్వెంచర్స్ , ఇండియన్ వైల్డ్‌లైఫ్ అడ్వెంచర్స్ నిర్వహించాయి. మా అద్భుతమైన ట్రెక్ లీడర్ జేడీ కి మేము ఎంతైనా కృతజ్ఞులం.

సబితతో పాటు నేను, మా స్నేహితులం విమానంలో హైదరాబాద్ నుండి ఢిల్లీచేరి, అక్కడి



నుండి కత్గోడం, ఆపై హల్ద్వాని వరకు కారు ప్రయాణం చేశాం. ఆ రాత్రి హల్ద్వాని లో బసచేసి, మరురోజు, ప్రకృతి సోయగాలతో మురిపించే పర్వత మార్గం గుండా పిథోరాగఢ్ జిల్లాలోని మున్సియారి వైపు ప్రయాణం ప్రారంభించాం. మధ్యలో ప్రసిద్ధ నీమ్ కరోలి బాబా ఆలయ దర్శనం చేసుకున్నాము. పది గంటల సుదీర్ఘ ప్రయాణం తరువాత మున్సియారికి చేరుకున్నప్పుడు నా మనస్సు ఉత్సాహంతో ఉప్పొంగిపోయింది.

**1వ రోజు: – మున్సియారి నుండి మార్టోలీ**

2025 అక్టోబర్ 5వ తేదీన మా జీపులు (బోలెరోలు) విరిగిపడిన కొండ చరియలను, చిన్న వాగులను దాటుకుంటూ, ఎగుడుదిగుళ్ళు, గుంటలు, మిట్టలతో కూడిన సరిహద్దు (బి ఆర్ ఓ) కరకు రోడ్లపై పయనించాయి. మధ్యాహ్నం 2 గంటలకు ఆక్కడితో రోడ్డు ముగిసిపోయి, రైల్‌కోట్ చేరుకుని, అక్కడి నుంచి రెండు గంటలు నడక సాగించి, సుమారు 3,200 మీటర్ల ఎత్తైన ప్రదేశంలో వున్న మార్టోలీ గ్రామం చేరుకున్నాము. మొదటిరోజు రాత్రి "రాజు హొటల్" అనే చెక్క నిర్మాణపు లాడ్జ్‌లో గడిపాము. స్థానిక నందాదేవి ఆలయాన్ని దర్శించాము.తెలి మంచు శిఖరాల వెనుక సూర్యుడు కరిగిపోతున్నట్టు కనిపించే అనుభూతి అద్భుతం!

**2వ రోజు : మార్టోలీ నుండి లావాంగ్: మంచు లోకంలోకి**

అక్టోబర్ 6వ తేదీన మేము తెల్లవారుజామునే బయలుదేరి, సుమారు ఐదు గంటల నడక తర్వాత లావాంగ్ గ్రామం (3,500 మీ ఎత్తు ) చేరుకున్నాం. ఇది స్థానికంగా బుగ్యాలు అని పిలువబడే సుందరమైన పచ్చిక మైదానం. అక్కడ మరొక నందాదేవి ఆలయాన్ని దర్శించిన తరువాత, జేడీ బృందం తయారుచేసిన వేడి వేడి భోజనం తిన్నాం. తరువాత మంచు మొదలైంది. మొదట తేలికగా పడుతున్న మంచు కొద్దిసేపట్లోనే తీవ్రమైన మంచు తుఫానుగా మారింది. పచ్చిక మైదానాలు క్షణాల్లోనే దట్టమైన తెల్లని పొరతో కప్పబడ్డాయి. సురక్షితంగా ఉండటానికి అందరం ఒకే డైనింగ్ టెంట్‌లో నిద్రించాలి అని జేడీ తక్షణ నిర్ణయం తీసుకున్నాడు.

ఒక టెంట్, పది మంది ట్రెక్కర్లు, బయట మాత్రం మంచు తుఫాను. కురిసే మంచు బరువుకు టెంట్ కూలిపోకుండా, ప్రతి అరగంటకోసారి మా బృందం టెంట్ పైకప్పును బాగా కదిపేవాళ్ళం. నిద్ర అసాధ్యం. భయంభయంగా వున్నా , మా చుట్టూ మంచు కమ్ముకుంటున్న సుందర దృశ్యం మమ్మల్ని ఉద్విగ్నులను చేసింది.

**3వ రోజు: లావాంగ్‌లో చిక్కుకుపోయాం**

అక్టోబర్ 7న తెల్లారి చూస్తే, అంతటా 10 సెంటీమీటర్ల మందాన అన్నిటినీ మంచు కప్పేసింది. మా సంచులు మంచులో మునిగిపోయాయి, చిన్న టెంట్లు కూలిపోయాయి, తుఫాను చెలరేగుతూనే వుంది. జేడీ , అతని బృందం ఎలాగో తంటాలుపడి వేడి అల్పాహారం తయారుచేసి తెచ్చారు. నీళ్లు గడ్డ కట్టేంత చల్లగా ఉండటంతో పళ్ళు తోమకుండానే తిన్నాం. పరిస్థితి మరింత దిగజారడంతో జేడీ సమీపంలో తాళం వేసివున్న యింటి తలుపులను బద్దలు కొట్టించి, మాకు ఆశ్రయం కల్పించాడు. అది చిన్న పొట్టి యిల్లు. నిలబడితే తలకు తగిలేంత పొట్టి. అంతటా దుమ్ము, ధూళి. ఇరుకైన యిల్లే అయినా, వెచ్చగా మాత్రం వుంది..

అక్కడే మేము ఇండియన్ ఆర్మీ అధికారులైన జతిన్,

**తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !**

విపిన్‌లను కలిశాం. వారు కూడా నందా దేవి శిఖర యాత్ర బృందంలో సభ్యులే.. వారు మాతో వుండడం నిజంగా ఒక వరం లాంటిది. వారు మాకు టీ ఇచ్చారు. శాటిలైట్ ఫోన్‌ద్వారా ఎస్ ఓ ఎస్ కాల్ చేసే అవకాశం ఇచ్చారు. స్థానిక మద్యం జాన్ (మిల్లెట్ బీర్)తో మాలో ఉత్సాహాన్ని నింపారు.

అక్కడినుంచి వెనక్కు వచ్చే ముందు, మేము ‘మిల్లం’ హిమనీనదం వైపు వెళ్ళి నందా దేవి, సునందా దేవి శిఖరాలను స్పష్టంగా, కనులవిందుగా చూశాము. బేస్ క్యాంప్ చేరుకోలేక పోయామన్న అసంతృప్తిని ఆ శిఖర సందర్శనం దూరంచేసింది.

ముందుకెళ్ళడమా? వెను తిరగడమా? నిర్ణయించుకోలేని అనిశ్చితిలో మేము లావాంగ్‌లో రెండు రాత్రులు మంచులో చిక్కుకుపోయాం. భవిష్యత్తులో ఎవరికైనా రక్షణ అవసరం వస్తే అనే ఆలోచన వచ్చి, నా స్నేహితుడు , సీనియర్ ఐ ఎ ఎస్ అధికారి జయేష్ రంజన్‌కు ఎస్ ఓ ఎస్ సందేశం కూడా పంపాను. ఆ రోజులు మా ఓర్పును పరీక్షించాయి, కానీ బృంద ఐక్యత మమ్మల్ని నిలబెట్టింది.

**4వ రోజు : మార్టోలీకి తిరుగు ప్రయాణం**

అది అక్టోబర్ 8. వాతావరణం అప్పటికీ ఏమాత్రం సానుకూలం కాకపోవడంతో ఇక వెనుదిరగవలసిందేనని జేడీ నిర్ణయించాడు. పోర్టర్లు మా సంచులను మోసుకుంటూ రాగా, మేము జాగ్రత్తగా ఐదు గంటలపాటు మంచు మార్గంలో పయనించి, మార్టోలీకి చేరుకున్నాం. నందా దేవి బేస్ క్యాంప్ చేరుకోలేకపోయామన్న అసంతృప్తి నిరాశ వున్నా, సురక్షితంగా వున్నామన్న ఉపశమనం కలిగింది.ఆ సాయంత్రం మేము మళ్ళీ ఆర్మీ అధికారులను కలుసుకున్నాం. సూర్యకిరణాల చిరు వెలుగులు స్వాగతిస్తుండగా, రమ్, డ్రై మటన్ కర్రీ సేవనం , సజీవంగా వున్నందుకు మేము జరుపుకుంటున్న “జీవనోత్సవం”గా మారింది.

**5వ రోజు: బ్రిఫు గ్రామం దిశగా ... నదీ సంగమం**

మరురోజు ఉదయం , అంటే అక్టోబర్ 9న మేము బ్రిఫు గ్రామంవైపు పర్వత అవరోహణ ప్రారంభించాము. ఒక్కొక్క దారిలో మూడు గంటల నడక . అది కిందికి నిటారుగా, చుట్టూ మెలికలు తిరుగుతూ సాగే దారి. ఆ ప్రయాణం మమ్ములను గోరి గంగా నది వద్దకు చేర్చింది. పర్వతాగ్రంనుంచి మంచుతోకూడి ప్రవహించే స్వచ్ఛమైన ఆ నదీజలాలతో మేము ముఖం కడుక్కున్నాం, కొద్దిగా నీళ్ళు తాగాం కూడా! మరికొంత ప్రయాణంచేసి, తర్వాత గోరి గంగా – లావా నదుల సంగమం వద్ద కొద్దిసేపు గడిపాము. సాహసించి, ఆ చల్లని నీళ్ళలోనే మాలో కొందరం గబగబా మునక వేశాం. మంచు కరుగుతున్నది. నులివెచ్చని కిరణాలతో, ఆ లోయ అంతటికీ బంగారు రంగు అద్దుతూ, సూర్యభగవానుడు మళ్ళీ సాక్షాత్కరించాడు! ఆ సాయంత్రానికి మేము తిరిగి మార్టోలీకి చేరుకున్నాం. మా మనస్సులు మళ్ళీ తేలికపడ్డాయి.

**6వ రోజు: మున్సియారీకి తిరుగుప్రయాణం**

అక్టోబర్ 10న మార్టోలీ నుండి రోడ్డు పాయింట్ వరకు ఒక గంట ఆ పర్వత మార్గంలో నడక సాగించాము. మార్గమధ్యంలో సీమ మోకాలు బెణికి నడవలేక పోయింది. అయితే, జేడీ వెంటనే ప్రథమ చికిత్స చేసి, కొంత దూరం ఆమెను మోసుకుంటూ, మొత్తంమీద సురక్షితంగా మమ్ములను సమీపంలోని రోడ్డు పాయింట్‌కి చేర్చాడు. అక్కడ మహీంద్రా జీపులు మా కోసం సిద్ధంగా వున్నాయి. అక్కడినుంచి వెనక్కు వచ్చే ముందు, మేము ‘మిల్లం’ హిమనీనదం వైపు వెళ్ళి నందా దేవి, సునందా దేవి శిఖరాలను స్పష్టంగా, కనులవిందుగా చూశాము. బేస్ క్యాంప్ చేరుకోలేక పోయామన్న అసంతృప్తిని ఆ శిఖర సందర్శనం దూరంచేసింది. సాయంత్రానికి మేము మున్సియారిలోని పైన్‌వుడ్ హోటల్‌కు చేరుకుని, చలిమంట పక్కన, కథలతో కాలక్షేపం చేస్తూ, నవ్వులతో ఆ రోజు ముగించాము.

**7వ రోజు – దార్కోట్‌లో సాంప్రదాయిక నేత సౌందర్యం**

మరురోజు మేము మున్సియారిలోని దేవాలయాలను, ఇతర చూడదగిన ప్రదేశాలను చూస్తూ తిరిగాము. ముఖ్యంగా ప్రసిద్ధ నందా దేవి ఆలయం, స్థానిక గిరిజన మ్యూజియం

**నీ మాట నిజమైతే అభినందించేవారు కొందరే, నిజం కాకుంటే నిందించేవారు ఎందరో**



సందర్శించాము. ఆపై డార్కోట్ గ్రామానికి వెళ్ళాము.

ఈ గ్రామంలో 65 మందికి పైగా మహిళా నేత కళాకారిణులు కుందేలు ఉన్ని (రాబిట్ వూల్)తో సుకుమారమైన ఖర్గోష్ శాలువలను, దుపట్టాలను తయారు చేస్తారు. మా బృందం అక్కడి కళాకారిణుల వద్ద సుమారు 50,000 రూపాయల విలువైన కొనుగోళ్ళు చేసింది. ఇంతేకాకుండా, ఈ హిమాలయ సంప్రదాయాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళా స్వయంసహాయక సంఘాలతో ముచ్చటించాము.

> ఇది ఐదు గంటలపాటు సాగే పర్వతారోహణం. ఆ దారి పొడవునా పైకి చూస్తే, మంచు దుప్పటి కప్పుకున్న హిమాలయ శ్రేణులు, పంచచూలీ పర్వతాలు, కిందికి చూస్తే, పచ్చదనం పరుచుకున్న లోయలు! ఎటు చూసినా కనువిందు చేసే కమనీయ, రమణీయ, మనోజ్ఞ దృశ్యాలు!

**8వ రోజు: ఖాలియా పర్వత శిఖరం– "జీరో పాయింట్"**

అక్టోబర్ 12వ తేదీన మేము (3,500 మీటర్ల ఎత్తులో)ఖాలియా శిఖరం బేస్ పాయింట్ వద్ద వున్న ఈకో పార్కుకు వెళ్లాము. ఇది ఐదు గంటలపాటు సాగే పర్వతారోహణం. ఆ దారి పొడవునా పైకి చూస్తే, మంచు దుప్పటి కప్పుకున్న హిమాలయ శ్రేణులు, పంచచూలీ పర్వతాలు, కిందికి చూస్తే, పచ్చదనం పరుచుకున్న లోయలు! ఎటు చూసినా కనువిందు చేసే కమనీయ, రమణీయ, మనోజ్ఞ దృశ్యాలు! మా బృందంలోని చాలామంది మధ్యలో ఆగిపోయారు. కానీ ,నేను జేడీ ప్రోత్సాహ, మార్గదర్శనాలతో జీరో పాయింట్ వరకు ఎక్కగలిగాను. పైపైకి వెళ్ళే కొద్దీ ఎక్కడం ఎంతో కష్టం! ఎంతో శ్రమ, అలసట! కానీ అలా వేసే ప్రతి అడుగూ శ్రమకు తగిన ఫలితాన్ని యిచ్చేదే. తలతిప్పి ఎటు చూసినా, చుట్టూ 360 డిగ్రీల పరిధిలో, నేత్రపర్వంగా సాక్షాత్కరించే ఆ మహోన్నత హిమాలయ పర్వత శ్రేణుల మనోహర దృశ్యం మంత్ర ముగ్ధులను చేస్తుంది!

కిందికి దిగడానికి కేవలం రెండు గంటలు పట్టింది. అప్పటికి నేను పూర్తిగా అలసిపోయాను, కాని మనసు ఎంతో ఉల్లాసంగా వుంది. ఆ రాత్రి మేము మరోసారి చలిమంట చుట్టూ కూచుని, మాకు ఎన్నో అరుదైన అనుభవాలను పంచిన ఆ పర్వతాలకు చివరి పానార్పణం చేస్తూ, మా పర్వతారోహణ యాత్రకు ముగింపు పలికాము.

**9-10వ రోజులు : తిరుగు ప్రయాణం**

అక్టోబర్ 13న సబిత , నేను మున్సియారి నుండి హెలికాప్టర్‌లో హల్ద్వానికి వచ్చాము. బృందంలోని మిగిలిన వారిలో కొందరు జిమ్ కార్బెట్‌కు వెళ్ళగా, ఇంకొందరు తిరిగి ఢిల్లీ వెళ్ళిపోయారు. మేము భీంతల్, సత్తల్, సమీప ఆలయాలను సందర్శించి, రైలులో కత్గోడం నుంచి గురుగ్రావ్‌కి చేరుకున్నాము.



ఆ తర్వాతి రెండు రోజులు ఢిల్లీలో పాత స్నేహితులు సురేష్, విజయ, చిట్టు, కెటిఎస్, డా. రేణు సూరి, డా. గీతా మేనన్ మొదలైన వారితో గడిపాము. ఇలా, మా హిమాలయ యాత్ర ఉత్తేజంగా, సంతోషదాయకంగా, అనిర్వచనీయమైన జ్ఞాపకాలను మిగుల్చుతూ. పూర్తయింది.

**నేర్చుకున్న పాఠాలు ...**

సంకల్పించిన విధంగా మేము నందా దేవి బేస్ క్యాంప్ చేరుకోలేనప్పటికి, ఈ పర్వతారోహణ మాకు జీవితకాలానికి ఒక్కసారి లభించే అనుభవాలను, అనుభూతులను అందించింది. మంచులో కూరుకుపోవడం, ఒకరికొకరంగా అందరం ఒకేచోట ఉత్కంఠతో గడపడం, నవ్వుతో భయాన్ని కప్పిపుచ్చుకుంటూ, మొండి ధైర్యంతో వుండడం, సురక్షితంగా బయటపడడం ... ఇవన్నీ నిజంగా జీవితానికి ఒక్కసారి లభించే అరుదైన అనుభూతులే !

> 2026 లో మా యాత్రను మళ్ళీ కొనసాగిస్తాం ...
> ప్రారంభించిన ప్రస్థానాన్ని పూర్తిచేయడానికి!

మెరుగైన రవాణా సదుపాయాలతో, ఈ పర్వతారోహణ యాత్రను 10 రోజులలో సులభంగా పూర్తి చేయవచ్చునని మేము గ్రహించాము. ఎలా అంటే ...

హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీకి ... (అక్కడి నుంచి) ... పితోరాఘర్ ...కారులో మూడు గంటలు మున్సియారికి (ఇక్కడి నుంచి ట్రెకింగ్ ప్రారంభం) ...మర్టోలి ...లవాంగ్ ...పత ...నందా దేవి బేస్ క్యాంప్ ... అదే మార్గంలో తిరుగు ప్రయాణం. హల్ద్వాని గుండా సుదీర్ఘ రోడ్డు ప్రయాణాల ఆవసరమే లేదు. జే డి, రాజు హోటల్ వంటి చక్కని స్థానిక సహాయకులు వుండనే వున్నారు.

మంచుతో గడ్డకట్టించే రాత్రులు, మంచు తాకిడికి చిరిగి, కారే టెంట్లు, అక్కడే చిక్కుకు పోతామేమోనన్న ఆందోళన ... ఇలాంటి ఎన్నో సవాళ్ళు వున్నా, మనం పర్వతాలను అధిరోహించాలని ఎందుకు కోరుకుంటామనే వాస్తవాన్ని ఈ సాహస యాత్ర మాకు గుర్తుకు తెచ్చింది.

ఎందుకంటే ... ఆ ప్రశాంత నిశ్శబ్ద వాతావరణాన్ని, అచ్చెరువు గొల్పే ఆ ఆమోఘ గాంభీర్యాన్ని, ఘనీభవించిన ఆ మహా నిర్నిద్రచైతన్య సోయగాన్ని ఆస్వాదించడానికి, అనుభూతి చెందడానికి, ఆనంద పరమావధికి చేరడానికి.

జేడికి, విసుగులేకుండా మాకు సహకరించిన ఆయన సహచర బృందానికి, మాతోపాటు ఈ సాహస యాత్రలో పాల్గొన్న మా మిత్ర బృందానికి నేను ఎప్పుడూ కృతజ్ఞుణ్ణి. మమ్ములను సురక్షితంగా కాపాడిన భగవతి నందాదేవికి కూడా! 2026 లో మా యాత్రను మళ్ళీ కొనసాగిస్తాం ... ప్రారంభించిన ప్రస్థానాన్ని పూర్తిచేయడానికి!

■

**ఇతరులను లెక్కచేయని పొగరుబోతుగా మార్చే విజయం కంటె, వినయాన్ని నేర్పే ఓటమి మేలు**

# సహకార ఉద్యమ సారథి రామారెడ్డి కన్నుమూత !

(9 వ పేజీ తరువాయి)

- ఆంధ్రప్రదేశ్ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం- 2001 రూపకల్పనలో సహకారం.

రామారెడ్డి గారు భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ, పేద రైతుల, కార్మికుల కష్టాలను దగ్గరగా చూసి చలించిపోయారు. వారికి కేవలం ఆర్థిక సాయం అందించడం కంటే, వారిని తమ కాళ్లపై తాము నిలబడేలా చేసే ఒక వ్యవస్థను నిర్మించాలని ఆయన సంకల్పించారు. ఆ సంకల్పమే వారిని సహకార రంగం వైపు నడిపించింది.

**ముల్కనూర్ సహకార సంఘం: ఒక ఆదర్శం.**

రామారెడ్డి గారి కృషిలో అత్యంత ముఖ్యమైనది ముల్కనూర్ సహకార పరపతి సంఘం. 1957లో ప్రారంభమైన ఈ సంఘం, కేవలం అప్పులిచ్చే సంస్థగా కాకుండా, రైతుల సమగ్రాభివృద్ధికి కృషి చేసింది. రామారెడ్డి గారి నాయకత్వంలో ఈ సంఘం:

- రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించింది.
- నకిలీ విత్తనాలు, ఎరువుల బాధ లేకుండా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించింది.
- రైతు పండించిన పంటకు మంచి మద్దతు ధర కల్పించేలా కృషి చేసింది.
- పారదర్శకత, సభ్యుల భాగస్వామ్యం అనే సూత్రాలను కఠినంగా పాటించింది.

ఈ సంఘం దేశంలోనే ఉత్తమ సహకార సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొంది, వేలాది మందికి ఆదర్శంగా నిలిచింది.

తన సేవా ప్రయాణంలో రామరెడ్డిగారు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. నిధుల కొరత, ప్రభుత్వ అనుమతులు, ప్రజల నమ్మకం పొందడం వంటి సమస్యలు. కానీ ఆయన పట్టుదల, నిజాయితీ, ప్రజలతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వాటిని అధిగమించారు.

నేడు సహ వికాసం కేవలం ఒక సంస్థ కాదు. అది ఒక ఉద్యమం. సమాజంలో ప్రతి ఒక్కరిని చైతన్యపరచి, కలిసి ముందుకు నడిపే శక్తిగా నిలిచింది.

సహవికాస సంస్థను ఆయన 2000వ దశకంలో స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం గ్రామీణ సమాజాల్లో ఆర్థిక, సామాజిక, పర్యావరణపరంగా స్థిరమైన అభివృద్ధి సాధించడం. “సహ” అంటే కలసి, “వికాస” అంటే అభివృద్ధి. ఈ రెండు పదాల సమ్మేళనం ద్వారా సమాజం మొత్తం ఒకటిగా ముందుకు సాగాలని ఆయన దృష్టి.

సహవికాస సంస్థ తొలుత కొద్దిమంది వలంటీర్లతో ప్రారంభమైంది. కానీ రామారెడ్డిగారి విజన్, నిబద్ధత, ఆత్మీయతతో ఈ సంస్థ నేడు వందలాది గ్రామాల్లో విస్తరించి, వేలాది కుటుంబాలకు ఆశాకిరణంగా మారింది.. సహ వికాస సంస్థ పలు రంగాల్లో ప్రభావవంతమైన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

శ్రీ రామరెడ్డిగారి కృషి అనేకమంది యువతకు ప్రేరణగా నిలుస్తోంది. ఆయన జీవితం మనకు చెప్పేమాట ఇదే : “స్వార్థం లేని సేవే నిజమైన వికాసం.”

సహకారం ద్వారానే గ్రామీణ సమాజం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందగలదని బలంగా నమ్మిన గొప్ప నాయకుడు ఆయన. “అభివృద్ధి అనేది ప్రభుత్వం నుంచి వచ్చే దానం కాదు, అది ప్రజల భాగస్వామ్యంతో కలసి సాకారం అయ్యే ప్రక్రియ”. అన్నది ఆయన నినాదం!

మామిడి రామారెడ్డిగారి జీవితం పూర్తిగా ప్రజాస్వామ్య విలువలు, సహకార భావన, సమాజసేవకు అంకితమై నట్టిది. ఏపిమాస్ ఈ మహనీయుని సేవలను స్మరిస్తూ , నివాళులర్పిస్తున్నది. ■

కృషికి మంచి సమయం రేపెప్పుడో కాదు, ఇప్పుడే, ఈ క్షణమే!

# ఆదిలాబాద్ లో 'వాష్' జిల్లాస్థాయి కార్యశాల

**తె**లంగాణా రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లాలో మహిళా అభివృద్ధి సొసైటీ అద్వర్యంలో వాటర్.ఆర్గ్ సంస్థ మద్దతుతో ఆదిలాబాద్ పట్టణంలోని డి ఆర్ డి ఎ – టి టి డి సి కార్యాలయంలోని జిల్లా మహిళ సమాఖ్య భవనంలో తేది 19.09.2025 నాడు నీరు పారిశుధ్యము మరియు పరి శుభ్రత (వాష్) పై జిల్లా స్థాయి కార్యశాల నిర్వ హించడం జరిగింది.




ఈ కార్యక్రమాన్ని జిల్లా సమాఖ్య పాదాది కారులు, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ రవీందర్ రాథోడ్ గారు, జిల్లా విద్యా అధికారి శ్రీ రమేష్ గారు, ఏ పీ డీ శ్రీ గోవింద్ రావు గారు, డీ పి ఎం లు శ్రీ రమాకాంత్ గారు, శ్రీ సాయి ప్రసాద్ గారు, శ్రీ సుగంధ్ గారు, శ్రీమతి వకుళ గారు, శ్రీమతి శోభారాణి గారు, శ్రీమతి మంజుల గారు, శ్రీ మల్లేష్ గారు, శ్రీ జ్ఞాను గారు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ డి ఎం సి శ్రీ శ్రీనివాస్ గారు, ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ – వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారిగారు, వాష్ జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్ గార్ల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.

తర్వాత జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ రవీందర్ రాథోడ్ గారు మాట్లాడుతూ నీరు పారిశుధ్యము మరియు పరిశుభ్రత (వాష్) అనే అంశాలను ప్రతి కుటుంబంలో నీటి యొక్క వినియోగం, త్రాగే నీటిని ఎలా శుభ్రపరుచుకోవాలి మరియు మరుగు దొడ్లను సరైన పద్ధతుల ద్వారా ఉపయోగించడం వలన రోగాలు దరికి చేరవు అని, వర్షాకాలంలో నీటిని నిల్వ చేయడం వలన దోమలు పెరుగుతాయని, దోమకాటు వల్ల డెంగ్యు మలేరియ మరియు చికెన్ గున్యా లాంటి రోగాలకు గురి కావడం జరుగుతుంది అని చెప్పారు.

అందుకు గాను వాతావరణన్ని పొడిగా ఉంచుకోవాలని, మరుగుదొడ్డి, మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై మన జిల్లాలోని సంఘాలలో నిరంతరంగా అందరికి వివరించాలి అని, మహిళా అభివృద్ధి సొసైటీ లాంటి స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకి ఇంకా అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేయాలని పిలుపు నిచ్చారు

తర్వాత జిల్లా విద్యా అధికారి శ్రీ రమేష్ గారు

**ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !**

మాట్లాడుతూ "మంచి ఆరోగ్యం మంచి విద్యకు దారి తీస్తుంది" అని ఆయన అన్నారు. ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాల పరిశుభ్రత సక్రమంగా ఉండాలని వివరిస్తూ... ముఖ్యంగా వయోజనులకు విద్య అవసరం వుందని, ఆ దిశగా అడుగులు ముందుకేయాలని చెప్పారు. విద్యావంతులు అధికంగా ఉన్న దేశాలే అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు

తర్వాత అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మాచారిగారు మాట్లాడుతూ నీరు పారిశుధ్యము మరియు పరిశుభ్రత (వాష్) జిల్లా స్థాయి కార్యశాల ఉద్దేశము ఎజెండా మరియు మహిళా అభివృద్ధి సొసైటీ యొక్క 24 సంవత్సరాల



సుదీర్ఘ అనుభవాలు, లక్ష్యాలు, సంస్థ విలువలు, సంస్థ కల, కల సహకారము మరియు చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు.

తర్వాత నీటి వల్ల సంక్షోభం గురించి చెప్పుతూ ప్రపంచ జనాభాలో 5% మంది బహిరంగ మలవిసర్జన చేస్తున్నారని, నీరు, పారిశుధ్యం మరియు పరిశుభ్రత సంబంధిత వ్యాధుల కారణంగా ప్రతి సంవత్సరం 10 లక్షల కంటే ఎక్కువ మంది మరణిస్తున్నారని, ప్రతి 2 నిమిషాలకు ఒక పిల్లవాడు నీటి సంబంధిత వ్యాధితో మరణిస్తున్నారని చెప్పారు.

ఇంకా 68 కోట్ల జనాభాకు గృహ నీటి కనెక్షన్ లేదు అని, 29% పాఠశాలల్లో కనీస నీరు మరియు పారి శుధ్యం అందుబాటులో లేదు అని చెప్పుతూ ముఖ్యంగా మహిళలు మరియు బాలికలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ 200 మిలియన్ గంటలు వెచ్చించి నీటిని సేకరిస్తున్నారని, అదే ఇండియాలో అయితే సుమారుగా 3 కోట్ల 50 లక్షల మందికి సురక్షితమైన నీరు మరియు 67 కోట్ల 80 లక్షల మందికి సురక్షితమైన టాయిలెట్ అందుబాటులో లేదు అని చెప్పుతూ నీరు పారిశుధ్యము మరియు పరిశుభ్రత (వాష్) ప్రాజెక్ట్ లక్ష్యాలు, ఉద్దేశ్యం మరియు ప్రాజెక్ట్ కార్యాచరణ వివరించి చెప్పడం జరిగింది.

సురక్షితమైన నీరు మరియు పారిశుద్ధ్యానికి ప్రధాన అవరోధాలలో ఆర్థిక వనరులు ఒకటి. అందువల్ల ఈ అవరోధాన్ని పరిష్కరించడానికి నీరు పారిశుధ్య రుణాలను అందేలా చేయడం.

ఇంటి యొక్క నీటి వసతులు మరియు మరుగు దొడ్డి సమస్యల పరిష్కారం కోసం ఆర్థిక వనరులను సమకూర్చ టానికి మరియు నిపుణుల సేవలు అందించ డానికి చిన్న, సరళమైన, సులభంగా తిరిగి చెల్లించ గల రుణాలను పొందేలా చేయడం జరిగిందని చెప్పారు.

ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలోఉన్న మహిళా సమాఖ్యల యొక్క వి.ఓ.ఎ / ఆర్.పి లకి వాష్‌పై అవగాహన కల్పించి వారిచే సంఘాలలోని మహిళ సభ్యులకు వాష్ అవసరాలకోసం వాడుకునేటట్లు చేయడం జరుగుతుందని, మరియు చేపట్టబోయే కార్యక్రమాలు అయిన సామజిక నీటి శుద్ధి ప్లాంట్ మరియు ఇంటి పై కప్పు వర్షపు నీటి సేకరణ గురించి వివరించారు.

మరియు మహిళా సంఘలలోని మహిళా సభ్యులు ఎవరైతే సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారో వారికీ సబ్సిడీ రూపేణ రెండు లక్షల రూపాయల వరకు మహిళా అభివృద్ధి సొసైటీ అందిస్తుందని చెప్పారు. ■

ప్రగతికి కొలమానం వేగం కాదు, దిశ ; నిదానమైనా అది సవ్యమైన దిశా, కాదా అనేది ప్రధానం

# సేంద్రియ సాగు : గుంటూరు మహిళకు ప్రధాని ప్రశంస!

*సకల అనారోగ్యాలకు మనం తీసుకునే ఆహారమే సగం కారణం. మితిమీరిన పురుగు మందులు, ఎరువుల వాడకంతో ప్రతి పదార్థమూ కలుషితమై ప్రాణాలకే ముప్పుగా పరిణమించింది. తనకొచ్చిన బ్రెయిన్ ట్యూమర్‌కు కూడా ఇదే కారణమని గుర్తించిన ఆ మహిళ తన ఇంట్లో వండేవి, తినేవన్నీ సహజసిద్ధంగా ఉండాలనుకున్నారు. రసాయనాలకు స్వస్తి పలికి, సేంద్రియ సాగు వైపు అడుగులు వేశారు. దేశీయ వంగడాలనే వాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నారు. ప్రధాని మోదీ ప్రశంసలు సైతం అందుకుని పలువురికి ఆదర్శంగా నిలిచారు.*

**గుం**టూరు జిల్లా అత్తోట గ్రామానికి చెందిన శ్రీ యర్రు సత్యనారాయణ, శ్రీమతి స్వాతి దంపతులది వ్యవసాయ కుటుంబం. సొంతంగా 2 ఎకరాల భూమి ఉండగా మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తంగా 12 ఎకరాల్లో సాగు చేసేవారు. పురుగు మందులు, ఎరువులు ఎన్ని వాడినా భూమి గుల్లబారడం తప్ప దిగుబడులు రాక ఇబ్బందులు పడేవారు. ఇలా వుండగా, స్వాతి బ్రెయిన్ ట్యూమర్ బారిన పడ్డారు. తన అనారోగ్యానికి విపరీతమైన రసాయనాలు వాటితో పండించిన పంట ఉత్పత్తులే కారణమని గుర్తించారు. భర్తను ఒప్పించి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లారు. అప్పటివరకూ వాడిన ఎరువులను పూర్తిగా పక్కన పెట్టారు. పశువుల పేడ, మూత్రంతో జీవామృతం, కషాయాలు తయారుచేసి పంటలకు చల్లుతూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడమే కాక, ఇటీవల ప్రధాని మోదీ ప్రశంసలనూ అందుకున్న శ్రీమతి స్వాతి స్ఫూర్తిమంతమైన ప్రస్థానాన్ని గురించి ఆమె మాటలలోనే ....



**ఖర్చు తక్కువ... నాణ్యత ఎక్కువ**

వ్యవసాయం చేయడం ఎన్నో సవాళ్లతో కూడుకున్న పని. పెద్ద పెద్ద రైతులే సాగు చేయలేక చేతులు ఎత్తేస్తున్నారు. ఈ నేపథ్యంలో... అరకొర చదువు, అంతంత మాత్రం ఆర్థిక స్తోమత ఉన్న నాలాంటి ఒక మహిళకు ఇది సాహసం అనే చెప్పాలి. అయినా ధైర్యం చేశాను. మాది గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామం. మాకున్న రెండు ఎకరాల మాగాణితో పాటు... కౌలుకు తీసుకున్న పది ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టాను. జిల్లా రైతు సాధికార సంస్థ సహకారాన్ని తీసుకున్నాను. మైసూర్ మల్లిక, ఇంద్రాణి, కాలా బట్టి, బ్లాక్ రైస్, నవారా, నారాయణ కామిని, రత్నచోడి, పంచరత్న, తులసీబానో తదితర దేశీయ వంగడాలను సాగుచేయడం ప్రారంభించాను. రసాయన ఎరువులు, క్రిమి సంహార మందులకు బదులు జీవామృతం, కషాయాలు వినియోగించాను. వాటిని నేనే స్వయంగా తయారు చేస్తాను. ఇలా తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన పంటలు పండిస్తున్నాను. నా సాగు పద్ధతులు జాతీయ స్థాయిలో వ్యవసాయ నిపుణులు, రైతుల దృష్టిని ఆకర్షించాయి. మా ప్రాంతంలో పర్యటించిన బ్రెజిల్ బృందం... నన్ను ప్రత్యేకంగా అభినందించింది.

**మరపురాని జ్ఞాపకం**

మా జిల్లాలో సేంద్రియ సాగు చేపట్టిన మొదటి మహిళా రైతును నేనే. మా కుటుంబం మొత్తం ఇప్పుడు సేంద్రియ వ్యవసాయంలో ఉంది. మాకు కావలసిన కాయగూరలు, ఆకుకూరలు మా పొలం గట్ల మీద, ఇంటి పెరట్లో పండిస్తున్నాం. ప్రకృతి సేద్యం ద్వారా... ఆరోగ్యకరమైన ఆహారంతో బ్రెయిన్ ట్యూమర్‌ను నేను జయించాను.

నా కృషికి గుర్తింపుగా... ఇటీవల ఢిల్లీలో... 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ' ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా 'పీజీఎస్ నేచురల్ ఫామ్ సర్టిఫికెట్'ను అందుకున్నాను. ప్రధానితో ముఖాముఖిగా మాట్లాడడం, ప్రశంసలు పొందడం నా జీవితంలో మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ■

ఆరడుగుల మనిషి విలువ నాలుగంగుళాల నాలుకమీద ఆధారపడి వుంటుంది !

# పాడి వ్యాపారం చేసే ఆ వృద్ధ దంపతుల ఆదాయం రోజుకు లక్ష!

**మ**హారాష్ట్రకు చెందిన ఓ వృద్ధ జంట పాల వ్యాపారంలో రాణిస్తోంది. రోజుకు దాదాపుగా రూ.లక్ష సంపాదిస్తోంది. పాల వ్యాపారంలో విప్లవం సృష్టించిన నాందేడ్‌కు చెందిన చంద్రకళాబాయి (78), ప్రభు అప్పా దంపతుల జీవిత ప్రయాణం నిజాయితీగా, సరైన నిర్ణయాలతో కష్టపడి పనిచేస్తే ఏ వ్యాపారమైనా ఎలా విజయవంతమవుతుందో చెప్పడానికి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోంది.

50 ఏళ్ల క్రితం అంటే 1985లో కేవలం రెండు గేదెలతో ప్రారంభమైన వారి పాల వ్యాపారం, నేడు నాందేడ్ వ్యాప్తంగా మార్మోగిపోతోంది. ఈ దంపతుల ఏర్పాటు చేసిన డెయిరీకి జిల్లా వ్యాప్తంగా మంచి పేరుంది. గతంలో తలపై కుండలో పాలు, పెరుగు పెట్టుకుని ఇంటింటికి వెళ్లి అమ్మిన చంద్రకళా బాయి, సైకిల్‌పై పశువుల దాణా, పాల పదార్థాలను విక్రయించిన ప్రభు అప్పా దంపతులు అపారమైన కృషి, నిజాయితీ, సేవా స్ఫూర్తి కారణంగా ప్రజల హృదయాలలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నేడు వారి 'ప్రభు దూద్ డెయిరీ' బాధ్యత తమ నాలుగో తరానికి అప్పగించారు.

**నిజాయితీగా వ్యాపారం**

చంద్రకళాబాయి, ప్రభు అప్పా ఇంటింటికీ వెళ్లి పాలు, పెరుగు వంటివాటిని అమ్మేవారు. తద్వారా తమ కుటుంబాన్ని పోషించుకునేవారు. తొలుత రెండు గేదెలతో పారంభించి, 1985లో 'ప్రభు దూద్ డైరీ'ని ఏర్పాటుచేసి, నిజాయితీగా కష్టపడి పని చేశారు. క్రమంగా కస్టమర్ల నమ్మకాన్ని పొందారు. దీంతో వ్యాపారం పెరిగింది. ఆ తర్వాత ఎక్కువ గేదెలను కొన్నారు. పాలు అమ్మగా, మిగిలిన వాటితో వెన్న, నెయ్యి, పెరుగు వంటి వాటిని తయారుచేసి విక్రయించి ఆదాయం పొందేవారు.

చంద్రకళాబాయి ఇప్పటికీ అదే ఉత్సాహంతో పని చేస్తోంది. అయితే నేడు ఆమె కుటుంబంలోని నాలుగో తరం ఈ వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్తోంది. పాలు, పెరుగు మాత్రమే కాకుండా అన్ని రకాల పాల ఉత్పత్తులు, స్వీట్లు, స్నాక్స్ కూడా పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. 50 ఏళ్ల క్రితం రెండు పాడి గేదెలతో ప్రారంభమైన ఈ వ్యాపారం నేడు 70కి పైగా గేదెలకు విస్తరించింది. ఇప్పటికీ చంద్రకళాబాయి గేదెలను జాగ్రత్తగా చూసుకోవడం, పాలు పితకడం, పెరుగు తయారు చేయడం, ఆవు పిడకలు చేయడం వంటి పనుల్లో పాలుపంచుకుంటోంది.

**రోజుకు రూ.లక్ష ఆదాయం**

చంద్రకళాబాయి డైరీ ఫామ్‌లో ముర్రా, జాఫర్, పంధర్ పురి, సోలాపురి జాతుల గేదెలు ఉన్నాయి. ఈ డైరీ ఫామ్ విస్తీర్ణం 9 ఎకరాలు. అక్కడే పశువులకు మేత వంటి వాటిని పండిస్తారు. గోధుమ గడ్డి, చెరకు కాండాలు వంటి వాటిని సమీప రైతులను నుంచి కొనుగోలు చేసి గేదెలకు దాణాకు వేస్తారు. ఈ డైరీ ఫామ్‌లో పశువుల నిర్వహణకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఫామ్‌లో గేదెలు రోజుకు దాదాపు 500 లీటర్ల పాలను ఇస్తున్నాయి. ఇక్కడ పాలను లీటరు రూ. 70 చొప్పున అమ్ముతున్నారు. ఈ పాలు అమ్మకం ద్వారా మాత్రమే రోజుకు రూ. 35,000 ఆదాయం వస్తోంది. అంతేకాకుండా పన్నీర్‌ను కిలో రూ. 360 చొప్పున విక్రయిస్తారు. రోజుకు రెండు క్వింటా కోవాను అమ్ముతారు. దాని ధర కిలో రూ.280. ఇలా పాలు, పన్నీర్, కోవా, ఇతర ఉత్పత్తుల నుంచి చంద్రకళాబాయి మొత్తం రోజుకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోంది. ■

## పోషకాల నిలయం కొత్త ఎర్ర వరి రకం!

**అ**త్యంత పోషక విలువలుగల బిపిటి–2858 ఎర్ర బియ్యం రకాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసింది. ఇది త్వరలో మార్కెట్‌లోకి రానుంది. దీని పంట కాలం 135 రోజులు. దిగుబడి హెక్టారుకు ఆరు టన్నులు, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ రాకుండా రోగ నిరోధక శక్తి వృద్ధి చేయడంలో ఈ రకం కీలక పాత్ర పోషిస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. ■

**మనంచేసే చాలా పనులు అత్యల్పంగా అనిపించవచ్చు, కాని వాటిని చేయడం అత్యవసరం**

# ఓర్వకల్లు ముఖచిత్రాన్ని మార్చిన పొదుపు ప్రస్థానం!

**క**రువుకు, వలసలకు నిలయమైన రాయలసీమలోని ఓర్వకల్లు ప్రాంతాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చారు బత్తుల విజయభారతి. పేద మహిళలను పొదుపుబాట పట్టించారు. వందల కోట్ల రూపాయల లావాదేవీలు సాగించే స్థాయికి ఎదిగేలా ప్రేరణనిచ్చారు. ముప్పయ్యేళ్ల క్రితం ఆమె నాటిన పొదుపు విత్తనం మహా వృక్షంగా మారి, వేలాది మందికి ఆధారంగా నిలుస్తోంది ఓర్వకల్లు మండలం పొదుపులక్ష్మి ఐక్య సంఘం గౌరవ సలహాదారు విజయభారతి కథ... ఆమె మాటల్లోనే...



"అది 1995 ఆగస్టు నెల. యూఎన్‌డీపీ (ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం) చేపట్టిన దక్షిణాసియా పేదరిక నిర్మూలన కార్యక్రమం తరఫున ప్రాజెక్టు ఆఫీసరుగా కర్నూలు జిల్లాకు వచ్చాను. నాకు ఆ ప్రాంతం గురించి ఏ మాత్రం అవగాహన లేదు. మా కార్యక్రమంలో మహిళలను ఎలా భాగస్వాముల్ని చేయాలి? పల్లెలకు వెళ్లి చెబితే... నా మాటలు వింటారా? ఒక బృందంగా కలిసి నడుస్తారా? ఇవన్నీ ఆ రోజు నా మదిలో మెదిలిన ప్రశ్నలు.

ఆ సమయంలో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహా రావు నంద్యాలలో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి నేనూ వెళ్లాను. అక్కడ ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు నాకు పరిచయమయ్యారు. వారి ఊరికి వస్తానంటే... ఆప్యాయంగా ఆహ్వానించారు. రెండు రోజుల తరువాత ఆ గ్రామం వెళ్లి, ఆ మహిళలను కలిశాను. ఆ తరువాత క్రమం తప్పకుండా అక్కడికి వెళ్లేదాన్ని. రోజూ పదిమంది మహిళలను కలిసి, పొదుపు ఆవశ్యకతను వివరించేదాన్ని.

"రోజంతా కష్టపడితే నాలుగు రూకలు కావడంలేదు. రోజుకో రూపాయి పొదుపు అంటే ఎలాగమ్మా?" అంటూ మొదట్లో వాళ్లు పట్టించుకోలేదు. ఈలోగా అప్పటి సీఎం చంద్రబాబు పొదుపు ఉద్యమాన్ని ఊరూరుకీ తీసుకువెళ్లారు. దాంతో... పదిమంది మహిళలను ఒప్పించి తొలి పొదుపు సంఘం ఏర్పాటు చేయగలిగాను. అలా 25 గ్రామాల్లో పొదుపు ఉద్యమ స్ఫూర్తిని రగిలించలిగాను.

**సామాజిక అంశాలపై దృష్టి**

మహిళలను రోజుకో రూపాయి చొప్పున పొదుపు చేయించాలంటే.. పల్లెసీమల్లో పట్టి పీడిస్తున్న సమస్యల మీద దృష్టి పెట్టడం ముఖ్యమని నిర్ణయించాం. తల్లులు పనికి వెళ్తే.... వారి పసిపిల్లల ఆలనాపాలన చూసేలా... ఆయాలను నియమించి, 'అమ్మఒడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల విద్య, ఒంటరి మహిళలకు చేయూత, విద్య, ఆరోగ్యం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్ల నిర్మాణం... ఇలా సామాజిక అంశాలపై కూడా చైతన్యం కలిగించాం.

అప్పటి జిల్లా కలెక్టరుతో మాట్లాడి, వితంతువులు, భర్తలు వదిలేసిన మహిళల కోసం కాల్వ గ్రామంలో 'జీవన జ్యోతి కాలనీ' నిర్మించాం. వివిధ గ్రామాల్లో 2,500 మంది బాల కార్మికులను గుర్తించి, వారికోసం 'భవిత బాల కార్మికుల పాఠశాల'ను ఏడేళ్లు నిర్వహించాం. చదువుతో పాటు ఏపీ రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో సీట్లు వచ్చేలా శిక్షణ ఇప్పించాం. ఆ పిల్లలు జీవితంలో స్థిరపడేంత వరకు చదివించాం. వాళ్లలో వందమంది నర్సులు, ముగ్గురు డాక్టర్లు, 24 మంది ఇంజనీర్లు, ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. పలువురు ఉపాధ్యాయులుగా కంప్యూటర్ ఆపరేటర్లుగా స్థిరపడ్డారు.

2000 సంవత్సరంలో మహిళల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం 'సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ' (సెర్ప్)ని నాటి సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారు. అది దేశంలోనే తొలి ప్రయోగం. ఆ సమయంలో 'జీవితాన వెలుగుందని నమ్మకాన్ని పెంచుదాం...' అనే పాట రాశాను. ఇప్పుడు అది రెండు తెలుగు రాష్ట్రాల్లో పొదుపు

మహిళల ప్రార్థన గీతం అయ్యింది. 'సెర్ప్'ను దేశంలోని అన్ని రాష్ట్రాలు 'స్టేట్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్' (ఎస్ఆర్ఎల్ఎం) పేరిట అమలు చేయడంలో కర్నూలు జిల్లాకు దివంగత మాజీ గవర్నర్ పెండేకంటి వెంకట సుబ్బయ్య కుమారుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ కృషి ఎంతో ఉంది.

**రూ.395 కోట్ల టర్నోవర్**

కాల్వ గ్రామంలో పది మందితో ఒక సంఘంగా మొదలైన పొదుపు ఉద్యమం ఊరూరా విస్తరించింది. 1998లో 500 పొదుపు సంఘాలతో.... 5 వేల మందితో ఏర్పాటైన 'ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘం' పరిధిలో.... ప్రస్తుతం 1,250 సంఘాలున్నాయి. 12,500 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఇన్వెస్టమెంట్ ఫండ్ రూ.1.20 కోట్లు, యూఎన్‌డీపీ ప్రాజెక్టు సీడ్ క్యాపిటల్ రూ.30 లక్షలు కలిపి ఐక్య సంఘానికి రూ.1.50కోట్ల నిధి చేకూరింది. ఆ డబ్బును పొదుపు సంఘాలకు 12శాతం వడ్డీకి అప్పులు ఇవ్వడం, ఇచ్చిన అప్పు సకాలంలో వసులు చేయడం ద్వారా ఐక్య సంఘం నిధి దాదాపు రూ.5.50 కోట్లకు చేరింది.

ఈ మహిళలే సొంతంగా 'మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సోసైటీ' (మహిళా బ్యాంక్) ఏర్పాటు చేశారు. రూపాయి పొదుపుతో మొదలు పెట్టిన ఈ సంఘాలు సుమారు రూ.395 కోట్ల టర్నోవర్‌కు చేరాయంటే మహిళలు సాధించిన విజయమే! వారు 3,75 ఎకరాల్లో మండల ఐక్య సంఘం సొంత ఆఫీసు, 15 గ్రామాల్లో గ్రామ సమాఖ్య ఆఫీసులు నిర్మించుకున్నారు. మా ఓర్వకల్లు మండలం పొదుపు లక్ష్మి ఐక్య సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. 'నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్' హోదా ఇచ్చింది.

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడమే కాదు... గ్రామ, మండల సమాఖ్య లీడర్లు సీఆర్‌పీలుగా పలు రాష్ట్రాలకు వెళ్లి సుమారుగా 50 వేల మంది శిక్షణ ఇచ్చారు. శ్రీలంక, ఇటలీ, మాల్దీవులు, నేపాల్ తదితర దేశాలకు వెళ్లి, అక్కడి జీవన ప్రమాణాలపై అధ్యయనంచేసే స్థాయికి ఓర్వకల్లు మహిళలు చేరుకున్నారు.

ప్రస్తుతం పీ–4 కార్యక్రమంలో భాగంగా మా మండల ఐక్య సంఘం ద్వారా పది కుటుంబాలను ఎంపిక చేశాం. పేదరికం వల్ల విద్యకు దూరం అవుతున్న పిల్లలు, జబ్బుల బారిన పడి వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమతలేని ఐదు కుటుంబాలకు తొలి విడతగా ఆర్థిక చేయూత అందించాం. వారి పిల్లల చదువు బాధ్యతలు మండల సమాఖ్య తీసుకుంది. అయిదేళ్లలో వంద కుటుంబాలకు పీ–4 కింద చేయూత ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

**బోధన నుంచి పొదుపు ఉద్యమం వైపు**

మా స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలు. నాన్న బి.రామయ్య సమాచార, ప్రజా సంబంధాలశాఖలో జిల్లా పీఆర్‌ఓగా,అమ్మ పి.అంజిమ్మ కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. నేను ఎంఇడి పూర్తి చేసి....నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరాను. నా చెల్లెళ్లలో భవాని డాక్టరుగా, రమా సుందరి గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తమ్ముడు శ్రీనివాస్ చక్రవర్తి యూఏఏ లో స్థిరపడ్డాడు.

నేను లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో 1991లో సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. నన్ను రిసోర్స్‌పర్సన్‌గా తీసుకున్నారు. ఆ తరువాత డ్వాక్రా (పొదుపు) ఉద్యమానికి అప్పటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో నేను చురుగ్గా పాల్గొనడంతో... నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీ సతీశ్‌చంద్ర సూచన మేరకు నాటి కలెక్టరు ఎం.సాంబశివరావు నన్ను డీఆర్‌డీఏ డ్వాక్రా ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమించారు.అలా బోధన నుంచి పొదుపు ఉద్యమబాట పట్టాను. నెల్లూరు జిల్లా లేగుంటపాడు గ్రామంలో... తొలి రూపాయి పొదుపు కార్యక్రమం మొదలు పెట్టాం. ఆ తరువాత కుప్పంలో మూడునెలలు పనిచేశాను. అదే సమయంలో యూఎన్‌డీపీ పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు జిల్లాలో ఏడు మండలాలు ఎంపికయ్యాయి. అలా... ప్రాజెక్టు ఆఫీసరుగా ఓర్వకల్లుకు వచ్చాను' అని విజయభారతి ఓర్వకల్లు ప్రాంతంలో సరికొత్త వెలుగులు నింపిన తన విజయ ప్రస్థానాన్ని వివరించారు. ■

**ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు**

# 500తో మొదలైన కోట్ల రూపాయల వ్యాపారం !

## సంఘ సభ్యత్వం నుంచి వ్యవస్థాపకురాలిగా ప్రేరణాత్మక ప్రస్థానం !!

**- ఏ.భాగ్యలక్ష్మి, మైత్రి ప్రవీణ్**

**కృ**షి, అంకితభావం, స్వయం సహాయక సంఘ శక్తి – ఒక మహిళ జీవితాన్ని ఎలా మార్చగలవనేది శ్రీమతి ఇ. విజయలక్ష్మి జీవిత ప్రయాణం మనకు చూపిస్తున్న ఉదాహరణ.

స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావ లంబనకు పునాది. చిన్న మొత్తాలతో ప్రారంభమైన ఈ ప్రయాణాలు, పట్టుదలతో పెద్ద విజయాలకు దారి తీస్తున్నాయి. ఈ పరిణామానికి ఉత్తమ ఉదాహరణ శ్రీమతి ఇ.విజయలక్ష్మి విజయగాథ!

తెలంగాణ రాష్ట్రంలో జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ నగరానికి చెందిన ఆమె, 'వీరాంజనేయ స్వయం సహాయక సంఘం' (రోజా ఎ ఎల్ ఎఫ్, ఇంద్రనగర్, వార్డు నం.19) సభ్యత్వం నుంచి విజయవంతమైన వ్యవస్థాపకురాలిగా ఎదిగి, నేడు కోట్లలో లావాదేవీలు కలిగిన సంస్థను నడుపు తున్నారు. శ్రీ ఇ. శ్రీనివాస్ ఈమె భర్త.

### వ్యాపార ప్రారంభం

2014లో ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజ్ ద్వారా వచ్చిన రూ.5,000/–తో శ్రీమతి విజయలక్ష్మి 'విజయ హెల్దీ ఫుడ్స్' పేరిట 'మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్' ను ప్రారంభించారు. మొదట కేవలం రూ.500/– పెట్టుబడితో కొన్ని లడ్డూలు తయారుచేశారు. ఎస్‌హెచ్‌జి సభ్యులతో ఉత్పత్తుల నాణ్యతను అంచనా వేయించుకున్నారు. సానుకూల స్పందనతో ఉత్సాహం పెంచుకొని, యూనిట్‌ను క్రమంగా విస్తరించారు.

### శిక్షణలతో నైపుణ్యాభివృద్ధి

తన వ్యాపారాన్ని మెరుగుపర్చుకోవడానికి ఆమె మార్కెటింగ్, లేబ్‌లింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్ వంటి వివిధ ఈ డీ పీ లలో (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్) పాల్గొని, శిక్షణ పొంది, అవగాహన పెంచుకొని, తన ఉత్పత్తులను మార్కెట్లో ప్రత్యేకంగా నిలిపే ప్రయత్నం చేశారు.

### 10 రకాల లడ్డూలు !

లడ్డూలు (10 రకాలు): నువ్వులు, వేరుశనగ, అవిసె, మోతి, డ్రైఫ్రూట్స్ మొదలైనవి

మిల్లెట్ బిస్కెట్లు (10 రకాలు): రాగి, జొన్న, కొర్ర, సజ్జ, సామలు మొదలైనవి

*"నా విజయానికి పునాది ఎస్‌హెచ్‌జి సభ్యత్వం, సమూహ శక్తి, ప్రభుత్వ పథకాల సహకారం. నేను చేసిన కృషి, పట్టుదలతో పాటు, ఎస్‌హెచ్‌జి వ్యవస్థ ఇచ్చిన బలమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది". – విజయలక్ష్మి*



అదనంగా : ప్రోటీన్ బాక్స్, ఖర్జూరాల ప్యాక్స్, అవిసె గింజలు (ఫ్లాక్స్ సీడ్స్), సోయా, డ్రైఫ్రూట్స్

### చట్టబద్ధత ,నాణ్యత ప్రమాణాలు

ఆమె తన వ్యాపారానికి అవసరమైన కార్మికశాఖ రిజిస్ట్రేషన్ , జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ , మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్, ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్ మొదలైన అన్ని లైసెన్సులు పొందారు. క్రమం తప్పకుండా ఆదాయం పన్ను చెల్లిస్తూ, ఐటీ రిటర్న్ దాఖలు చేస్తారు.

### వ్యాపార విజయం , గుర్తింపు

– వార్షిక టర్నోవర్ రూ. 2.00 కోట్లు

విజయగాథలు తెలివికి పదునుపెట్టలేవు, పరాజయ కారణాలే ఆలోచనలను రేకెత్తిస్తాయి

# ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి

ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి అని మత్స్యశాఖ కమిషనర్ రామశంకరనాయక్ అన్నారు. ఆక్వా జోన్ మ్యాపింగ్ సర్వే ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. మచిలీపట్నంలో ఎఫ్‌డీవోలు, ఏడీలు, సాగర మిత్రలతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఇటీవల నిర్వహించారు.

ఈ సందర్భంగా రామశంకర నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,97,690 ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే, ఇప్పటికి కేవలం 2, 40, 390 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో అయ్యాయన్నారు. వాస్తవానికి 16వ తేదీతో గడువు ముగుస్తుందని, అయితే ప్రభుత్వం మరో 15 రోజులు గడువు పొడిగిస్తుందన్నారు.

గ్రామస్థాయిలో పడవల సంఖ్య, సాగు విస్తీర్ణం, ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో చెరువుల్లో సాగవుతున్న చేపల సాగు విస్తీర్ణ వివరాలను కూడా ఆన్‌లైన్ చేయాలని చెప్పారు.

అమెరికాకు రొయ్యలు, చేపల ఎగుమతులు ఆగిపోయినందున ఆక్వా రైతులు నష్టపోకుండా నూతన ప్రణాళిక రూపొందించామన్నారు. ఐరోపా ఖండంలోని దేశాలకు ఎగుమతులు పంపేందుకు యోచిస్తున్నామన్నారు.

ఇందుకు గాను రైతులు పండించే రొయ్యలు గ్లోబల్ ప్రమాణాలకు తగిన విధంగా పండించాలన్నారు. మత్స్య సహకార సంఘాలు ఇందుకు చొరవ చూపాలని కోరారు. ఎన్ఎఫ్‌డీపీ కింద నమోదు చేస్తే పీఎఫ్ఎంఎస్ స్కీం కింద ఇన్సూరెన్స్ కవరేజి వచ్చే అవకాశం ఉందన్నారు.

క్లస్టర్ స్థాయిలో రైతులను చైతన్య పరచాలన్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సాగయ్యే కొత్తరకం రొయ్యలను తీసుకుని వస్తున్నామన్నారు.

ఐరోపా, జపాన్, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్‌లకు ఎగుమతి చేసేందుకు ఎంపెడా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుందన్నారు. ■

---

– 2023 లో జాతీయ స్థాయి అవార్డు

– ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ చే మహిళా దినోత్సవ సత్కారం

– హైదరాబాద్, బెంగళూరు లలో ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లలో ప్రాతినిధ్యం

– సోషల్ మీడియాలో ప్రచారం, ఆన్లైన్ మార్కెటింగ్

**ప్రభుత్వ సహాయం**

– స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లో 2 లక్షల రుణం

– ఎన్ యు ఎల్ ఎం పథకం కింద యంత్రాలు, నిల్వ గదులకు ఆర్థిక సహాయం

– పి ఎం ఎఫ్ ఎం ఇ స్కీమ్ కింద రూ. 10 లక్షల సబ్సిడీతో రూ. 60 లక్షల రుణం,

– ఆదిలాబాద్‌లో 3 అంతస్తుల కొత్త భవన నిర్మాణం

**80 మందికి ఉపాధి**

ప్రస్తుతం ఆమె యూనిట్లో 80 మంది ఎస్‌హెచ్‌జి సభ్యులు / కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు**

– హైదరాబాద్‌లో మరిన్ని శాఖలు ప్రారంభించడం

– తెలంగాణ & ఆంధ్రప్రదేశ్‌లో డీలర్ నెట్వర్క్ ఏర్పాటు

– ఎగుమతి అవకాశాలు అన్వేషించడం

శ్రీమతి విజయలక్ష్మి ప్రేరణాత్మక ప్రస్థానం అందరికీ ఒక స్ఫూర్తిదాయక పాఠం! చిన్న ఆరంభం –శిక్షణ – పట్టుదల – ప్రభుత్వ పథకాల వినియోగం – నేడు కోట్లలో వ్యాపారం – ఈ విజయగాథను చూసి మరెందరో ఎస్‌హెచ్‌జి మహిళలు ప్రేరణ పొందుతున్నారు. ■

# ఆరోగ్యం, ఐక్యత, సేవాస్ఫూర్తికి ప్రతీక 'విప్రో రన్' !

– జాహ్నవి, భవాని

గోపన్‌పల్లిలోని విప్రో సెజ్‌లో 2025 సెప్టెంబర్ 21న 'స్పిరిట్ ఆఫ్ విప్రో రన్ ' ఘనంగా నిర్వహించబడింది. గత రెండు దశాబ్దాలుగా, స్పిరిట్ ఆఫ్ విప్రో రన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మన సమాజాలను ఒకే లక్ష్యం, ఐక్య పురోగతి ప్రాతిపదికన ఏకం చేస్తోంది. స్పిరిట్ ఆఫ్ విప్రో రన్ ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా ప్రదేశాల్లో జరిగింది. ఇది కేవలం శారీరక వ్యాయామం లేదా క్రీడ మాత్రమే కాకుండా, ఐక్యత, ఆరోగ్యం , సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది.

ప్రతి నమోదు ద్వారా విప్రో ఫౌండేషన్ లోని ఉద్యోగుల తోడ్పాటు విభాగం అయిన విప్రో కేర్ ద్వారా కార్పొరేట్ విరాళం అందించబడుతుంది. ఈ మాధ్యమంగా ప్రపంచవ్యాప్తంగా 85కి పైగా లాభాపేక్ష లేని సంస్థలు లబ్ధి పొందుతాయి. ఈ భాగస్వామ్యాలు ఆరోగ్య పరిరక్షణ, విద్యా అవకాశాల విస్తరణ. పర్యావరణ స్థిరత్వంపై అవగాహన కల్పించే దిశగా పని చేస్తున్నాయి.

ఈ కార్యక్రమంలో ఏపిమాస్ నుంచి సుమారు 60మంది సిబ్బంది, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల నృత్య ప్రదర్శనలు ఈ వేడుకకు మరింత ఉత్సాహాన్ని అందించాయి. పరుగుతో పాటు, స్వచ్ఛంద సేవ (వలంటీరింగ్ యాక్టివిటీ)ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వలంటీర్లు కేవలం పరుగులో పాల్గొనేందుకే కాకుండా, ఉమ్మడిగా 100 పోషకాహార కిట్లను తయారుచేసే ప్రక్రియలో భాగమయ్యారు. ఈ కిట్లు గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించడానికి తోడ్పడతాయి.

విప్రో వలంటీర్లు ప్రతి కిట్‌ను ఎంతో శ్రద్ధతో సిద్ధం చేయగా, వాటిలో కేవలం ఆహారం మాత్రమే కాకుండా, సానుభూతి, శ్రద్ధ, ప్రోత్సాహంకూడా జతచేశారు.

**కిట్‌లోని పదార్థాలు**

- జెండా రంగు దారం – గర్భిణీ స్త్రీలు, తల్లులు విభిన్న పోషకాహార పదార్థాలు (నారింజ రంగు – విటమిన్ ఎ ఉన్న పదార్థాలు, తెలుపు – పాలు, ధాన్యాలు, పప్పులు, పచ్చ – ఆకుకూరలు) తీసుకోవాలని గుర్తు చేస్తుంది.
- రాజగిరా లడ్డు – తోటకూర గింజలు, బెల్లంతో చేసిన ఈ లడ్డు ప్రోటీన్, కాల్షియం, ఐరన్ పుష్కలంగా ఉండి, తల్లుల శక్తిని పెంచుతుంది.
- ఖర్జూరాలు – వీటిలో సహజశక్తి, ఐరన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. రక్తహీనత నివారణకు తోడ్పడతాయి.
- పల్లీ చిక్కీ – పల్లీలు, బెల్లంతో చేసిన సంప్రదాయ మిఠాయి. ఇది ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు అందించి, రోగ నిరోధకశక్తి పెంపును ప్రోత్సహిస్తుంది.
- హాండ్ టవల్ – పరిశుభ్రతను ప్రోత్సహిస్తుంది, సోకే వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
- సమాచార పత్రాలు – గర్భధారణ, ప్రసవానంతర సంరక్షణ, శిశుపోషణపై అవగాహన కలిగించే సమాచార పత్రాలు.
- వ్యక్తిగత సందేశాలతో కూడిన గ్రీటింగ్ కార్డు – తల్లులకు, గర్భిణులకు ధైర్యం, ప్రోత్సాహం, శుభాకాంక్షలతో కూడిన వ్యక్తిగత సందేశాలు.
- పర్యావరణ హిత వస్త్ర సంచి – పర్యావరణహితంగా అవసరమైన వస్తువులను మోసుకుపోవడానికి.

అక్కడ తయారుచేసిన పోషకాహార కిట్లను పట్టణ పోషణ పథకం అమలు చేస్తున్న ప్రాంతాలలో నివసించే గర్భిణులకు, బాలింతలకు ఇవ్వబడతాయి.

ఈ స్వచ్ఛంద చర్య కేవలం పదార్థ సహాయం అందించడమే కాదు, వ్యక్తిగత శుభాకాంక్షలు, ప్రోత్సాహకరమైన సందేశాల ద్వారా మనసుకు హత్తుకునే భావోద్వేగ అనుబంధాన్ని సైతం కలిగిస్తుంది. ఇది మాతృమూర్తులలో

# రైతులకు తక్కువ ధరకే మేలుజాతి కూరగాయల నారు!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యాన రైతులను ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టింది. చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని పెద్దబంగారునత్తంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఏర్పాటు చేసింది. ఇక్కడ కొత్త సాంకేతికతతో కూరగాయల నారును పెంచి, తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నారు. అంతేకాకుండా, పెంపకంపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. ఈ సెంటర్‌లో ఇక్రిశాట్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో టమాట, మిరప, క్యాప్సికం, వంగ, కాకర వంటి కూరగాయలకు సంబంధించిన నారును అంటు కడుతున్నారు. దీని కోసం ఇండో-ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. నాణ్యమైన విత్తనాలను తెప్పించి, వాటిని ఇక్కడ పెంచుతున్నారు. ఈ కేంద్రం ద్వారా రైతులు ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగును నేర్చుకుని, మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ, వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.



వివిధ ప్రాంతాల ఉద్యాన, వ్యవసాయ అధికారులకు, వ్యవసాయ కళాశాలల విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, ఇజ్రాయెల్ నిపుణులు కూడా శిక్షణలో పాల్గొంటున్నారు. క్షేత్రస్థాయిలోనూ అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 45కు పైగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, 2600 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వంగ, టమాట నార్లకు అంటు కడుతున్నారు.

వంగ నారుకు రూ.9 చెల్లించాల్సి ఉంటుంది. టమాట నారు కావాలంటే ఒక్కో మొక్కకు రూ.7.50 చెల్లించాలి. సాధారణ పద్ధతుల్లో పెంచిన టమాట, బీర, కాకర నారు ధరలు కూడా అందుబాటులో ఉన్నాయి. టమాట నారు 20 పైసలకు, బీర నారు 50 పైసలకు, కాకర (ప్రగతి) నారు 50 పైసలకు లభిస్తాయి. అయితే కాకరలో పాలీ రకం, వంగ నార్లు ఉచితంగా అందిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా రైతులు, అధికారులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేర్చుకుంటున్నారు.

తీగజాతి రకాలకు 15 రోజులకు ముందుగా.. టమాట, వంగకైతే 30 రోజుల ముందే రైతులు ఉద్యాన అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్ నకళ్లను సమర్పించాలని కుప్పం ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. తనకు పదెకరాల పొలం ఉందని.. రెండెకరాలలో పందిరి వేసి తీగజాతి రకం పంటలు పండిస్తున్నామని ఓ రైతు తెలిపారు. సీఓఈలో అంటుకట్టిన నార్లను మొదటిసారిగా తానే తీసుకున్నట్లు చెప్పారు. గుమ్మడి, కాకరనార్లను కొనుగోలు చేశానని, మంచి దిగుబడులు వచ్చాయని, సాధారణ సొర, కాకర రకాలను కూడా సాగు చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో రైతులు ఎక్కువగా టమాటాను సాగు చేస్తుంటారు. వారికి ఈ నారు ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. ఇతర కూరగాయలు సాగు చేసేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచిస్తున్నారు. ■

---

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడానికే కాకుండా, సమాజంలో సానుభూతి, చైతన్యం, పరస్పర మద్దతు వాతావరణాన్ని మరింత బలపరస్తుంది.

ఈ కార్యక్రమం విప్రో , ఏపిమాస్ సంయుక్తంగా చేపట్టిన ఒక విశిష్టమైన నమూనా. పోషకాహారం, విద్య, పరిశుభ్రత, భావోద్వేగ మద్దతు అన్నింటినీ ఒకేవేదికపైకి తీసుకువస్తూ, గర్భిణులు, పిల్లలు, కిశోర బాలికల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇది బలమైన సాధనంగా రూపొందింది.

స్పిరిట్ ఆఫ్ విప్రో రన్ : సమాజానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు, సంస్థలకు విలువల పటిష్ఠీకరణ సాధనం, సమిష్టి ఐక్యతకు నిదర్శనం! ■

నీ మాట నిజమైతే అభినందించేవారు కొందరే, నిజం కాకుంటే నిందించేవారు ఎందరో

# చేబ్రోలు సర్పంచ్‌కి జాతీయ స్థాయిలో మొదటి స్థానం!

**అదో** మేజర్ గ్రామ పంచాయతీ. జనాభా కూడా ఎక్కువే. దీంతో గ్రామంలో ఒకప్పుడు ఎక్కడ చూసినా చెత్తా చెదారం, ప్లాస్టిక్, అస్తవ్యస్త డ్రెయిన్లు, రోడ్లు దర్శనమిచ్చేవి. పంచాయతీ అధికారులు ప్రజల్లో ఎంత అవగాహన కల్పించినా, చెత్త సమస్యకు పరిష్కారం లభించేది కాదు. అయితే ... వీటిని సవాలుగా తీసుకున్న ఆ గ్రామ సర్పంచ్ సమస్యలకు తనదైన పరిష్కారం చూపుతున్నారు. కేవలం పనిచేయడమే కాకుండా తన పని పలువురికి తెలిసేలా 'సంవాద్ యాప్ ' ను వేదికగా చేసుకుని జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు

రాంధే లక్ష్మీ సునీత ఏలూరు జిల్లా చేబ్రోలు గ్రామ పంచాయతీ సర్పంచ్. ఊరిని బాగు చేయాలనే ఉద్దేశంతో 2021లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. మొదట్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రచారం చేశారు. అది ప్రజల్లో బాగా చైతన్యం తీసుకురావడంతో చేబ్రోలు గ్రామాన్ని జిల్లా స్థాయి సుప్రీం ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపిక చేశారు. అలా ఇటీవల నిర్వ హించిన సర్పంచ్ సంవాద్ పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు.



**దేశంలోనే మొదటి స్థానం :**

భారత నాణ్యత మండలి ఆధ్వర్యంలో దేశంలోని సర్పంచులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు సర్పంచ్ సంవాద్ పేరిట కేంద్రం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు, పలు సమస్యలకు తాను చూపిన పరిష్కార మార్గాలను ఎప్పటికప్పుడు ఫొటోలు, వీడియోల రూపంలో పొందుపరుస్తూ జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు లక్ష్మీ సునీత.

స్వచ్ఛత, తాగునీటి నిర్వహణతోపాటు చెత్త నుంచి సంపద తయారీ, మెరుగైన పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పలు అంశాలపై వీడియో తయారు చేసి యాప్‌లో పొందుపరచి దేశంలోనే మొదటి స్థానం దక్కించుకున్నారు. ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

**ఒక్కో నెల ఒక్కో కార్యక్రమం**

ఒక్కో నెల ఒక్కో కార్యక్రమాన్ని ఎంచుకుని గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా సంపద తయారీ కేంద్రాలకు తరలించి అక్కడ సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నారు. ప్లాస్టిక్, గాజు, ఈ-వేస్ట్ ... ఇలా దేనికది వేరుచేసి విక్రయిస్తూ పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తున్నారు.

సునీత కృషితో ప్రస్తుతం స్వచ్ఛత, వ్యర్థాల నిర్వహణ, రోడ్లు, డ్రెయిన్లవంటి అంశాల్లో చేబ్రోలు గ్రామం ముందుంది. గ్రామానికి అత్యంత అవసరమైన మేజర్ డ్రెయిన్ నిర్మించడమే లక్ష్యంగా , నిధులు సమకూర్చే దిశగా సునీత పని చేస్తున్నారు.

**అటు గుర్తింపు ... ఇటు అవార్డు!**

"**స**ర్పంచ్ సంవాద్ మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నప్పటి నుంచి గ్రామంలో జరిగే అన్ని అభివృద్ధి కార్యక్రమాలను అప్లోడ్ చేస్తున్నాము. దీంతో దేశం మొత్తం మా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తుంది. 'భారత నాణ్యతా మండలి' గ్రామాల అభివృద్ధిపై నెలవారి పోటీలను నిర్వహిస్తోంది. మా గ్రామ స్వచ్ఛతా కార్యక్రమంమీద ఒక వీడియోను అప్లోడ్ చేశాను. దేశం మొత్తం మీద అది మొదటి స్థానంలో నిలిచింది. అలాగే ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ... ఈ రెండూ నాకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి"


*– రాంధే లక్ష్మీ సునీత, చేబ్రోలు సర్పంచ్* ■

**నేటి నీ బాధ్యతను విస్మరిస్తే రేపటి రోజున దోషిగా నిలవక తప్పదు, జవాబు చెప్పుకోక తప్పదు**

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

RNI Regd.No: TELTEL/2003/16365 MAHILA SADHIKARATHA Postal Regd No: HCD1064/2024-26
Publication Date:01-11-2025 Posting at BPC-1V Patrika Channel, Nampally, Hyderabad-500001 Posting Date: 05/06-11-2025




'ఎఫ్ పి ఓల వ్యాపార వేగవంతం' ప్రాజెక్ట్ ప్రారంభం ..... మరి కొన్ని దృశ్యాలు




నందా దేవి పర్వతారోహణలో సి ఎస్ బృందం ..... మరి కొన్ని దృశ్యాలు



ఎఫ్ పి ఓలలో లైంగిక సమతుల్యతపై మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఏపిమాస్ శిక్షణ

To ADDRESS



విద్యార్థులతో సి ఎస్ సహభోజనం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని,
తానీషానగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089